## ప్రాణాలు తోడేస్తున్న వాయుకాలుష్యం

న్యూఢిల్లీ : వాయుకాలుష్యం పలు రకాల ఆరోగ్య సమస్యలను తెచ్చి పెట్టటమే కాదు.. ఏకంగా ప్రాణాలనే హరిస్తోంది. మన దేశంలో ప్రధాన నగరాల్లో రోజువారీ సంభవించే మరణాల్లో సగటున 7.2 శాతం మరణాలు వాయుకాలుష్యం వల్లనే సంభవిస్తున్నాయని తాజాగా ఓ అధ్యయనం వెల్లడించింది. ఈ నగరాల్లో హైదరాబాద్ కూడా విశేషం. 'లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్'లో ఈ అధ్యయనం వివరాలు ప్రచురితమయ్యాయి. వారణాసిలోని బనారస్ హిందూ యూనివర్సిటీ, ఢిల్లీలోని సెంటర్ ఫర్ క్రానిక్ డిసీజెస్ కంట్రోల్‌తో పాటు వివిధ దేశాలకు చెందిన పరిశోధన సంస్థలతో కూడిన ఒక బృందం ఈ అధ్యయనం నిర్వహించింది. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, అహ్మదాబాద్, హైదరాబాద్, కోల్‌కతా, పుణె, షిమ్లా, వారణాసిల్లో పరిశోధకులు.. పీఎం 2.5 వాయుకాలుష్యానికి ఆయా నగరాల్లో మరణాలకు మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషించారు.

RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 212 మేడ్చల్ మల్కాజ్‌గిరి 24 ఆగష్టు 2024 శనివారం పేజీలు : 4




# గులాబీ పార్టీకి ఆశాజ్యోతిలా రైతు రుణమాఫీ..!

## కిటుకు కనిపెట్టిన బీఆర్ఎస్..

హైదరాబాద్ : తెలంగాణలో... పోగొట్టుకున్న చోటే వెదుక్కోవాలని డిసైడైందట బీఆర్ఎస్. అందుకోసం ఏం చేయాలా అని తెగ ఆలోచిస్తున్న టైంలో వెదకబోయిన తీగ కాలికి తగిలిందని పార్టీ పెద్దలు సంబరపడుతున్నట్టు తెలుస్తోంది. రైతు రుణమాఫీ గులాబీ పార్టీకి ఆశాజ్యోతిలా కనిపిస్తోందని అంటున్నారు. అందేటీ... రుణమాఫీ చేసింది కాంగ్రెస్ సర్కార్ కదా... అది బీఆర్ఎస్‌కు ఎలా ఊతం అవుతుందన్న డౌట్ రావడం కామన్. కానీ అసలు కిటుకు అక్కడే ఉందంటున్నాయి తెలంగాణ భవన్ వర్గాలు. రాష్ట్ర సాధన సమయంలో బీఆర్ఎస్ ఏ మీటింగ్ పెట్టినా... లక్ష్యం ఒక్కటే ఉండేది. జనం కూడా కన్విన్స్ అయ్యేవాళ్ళు. కానీ.. పదేళ్ళ అధికారం తర్వాత పార్టీ రీతి మారిపోయిందన్న వాదన ఉంది పొలిటికల్ సర్కిల్స్‌లో. అందుకే మంచి కాజ్ కోసం ఎదురు చూస్తున్న టైంలో రుణమాఫీ అంశం దొరికిందని అంటున్నారు. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్టుగా రెండు లక్షల రూపాయల లోపు రైతు రుణాల్ని మాఫీ చేసింది కాంగ్రెస్ సర్కార్. అయితే... ఆ ఫలం అర్హులైన రైతులు అందరికీ అందలేదన్నది బీఆర్ఎస్ పాయింట్. ఇప్పుడు ఇదే అంశాన్ని పట్టుకుని జనంలోకి వెళ్ళే ప్రయత్నంలో ఉంది ప్రతిపక్ష పార్టీ. గ్రామాల వారీగా.... అర్హత ఉండి, మాఫీ జరగని రైతుల వివరాలు సేకరించి ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని నిలదీయాలని అనుకుంటోందట. ముందు చెప్పినట్టుగా అర్హత ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ జరిగేలా వత్తిడి తీసుకువస్తే పోగొట్టుకున్న చోటే తిరిగి పుంజుకోవచ్చన్నది పార్టీ ప్లాన్‌గా తెలిసింది. గత ఎన్నికల్లో గ్రామీణ తెలంగాణలో దారుణంగా దెబ్బతింది కారు పార్టీ. సహజంగానే ఇక్కడ రైతులు ఎక్కువ ఉంటారు కాబట్టి రుణమాఫీ ఉద్యమం ద్వారా వాళ్ళని తిరిగి తమవైపునకు మళ్ళించుకోవాలన్నది బీఆర్ఎస్ అధిష్టానం ప్లాన్‌గా తెలిసింది. దాని ద్వారా.. ఇచ్చిన హామీని కాంగ్రెస్ సర్కార్ నిలబెట్టుకోలేకపోతే... రైతుల తరపున తామే పోరాడి ఇప్పించామన్న ఇమేజ్ తెచ్చుకోవాలన్న ప్లాన్ ఉందట. అందుకే గ్రామాల వారీగా రుణమాఫీ అవ్వని రైతుల డేటాను పార్టీ తరపున సేకరించే పని ముమ్మరంగా జరుగుతోందట. తర్వాత మాఫీ అవ్వని రైతులందర్నీ ఏకం చేసేపని మొదలవబోతున్నట్టు తెలిసింది. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టు తాము జనాల్లోకి వెళ్ళడానికి ఒక అంశం దొరికింది. అదే సమయంలో దూరమైన గ్రామీణ ఓటర్లను త్వరగా చేరుకోవడానికి లైన్ క్లియర్ అయిందన్న చర్చ జరుగుతోంది గులాబీ పార్టీలో. రుణమాఫీ అవ్వని రైతుల తరపున పోరాటం చేస్తే.. వాళ్ళకు దగ్గర అవడంతో పాటు తమకు పొలిటికల్ గ్రౌండ్‌లో ప్లేస్ దొరుకుతుందన్నది బీఆర్ఎస్ స్కెచ్‌గా తెలుస్తోంది. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, ఇతర ఆందోళన కార్యక్రమాలు నిర్వహించబోతున్నారట.అయితే... ఇదే సమయంలో పార్టీలోనే ఇంకో వాయిస్ వినిపిస్తోందని అంటున్నారు. రుణమాఫీ విషయంలో అప్పుడే తొందరపడటం ఎందుకు? కొన్నాళ్ళు ఆగితేనే మంచిదని అంటోందట ఆ వర్గం. ఒకే ఊళ్ళో కొందరికి మాఫీ అయి మరి కొందరికి అవకుంటే... ఆటోమేటిగ్గా రైతుల్లోనే వ్యతిరేకత మొదలవుతుందని, అలాంటప్పుడు ఆ అగ్గికి ఆజ్యం పోస్తే తేలిగ్గా వర్కౌట్ అవుతుందిగానీ... ఇప్పటి నుంచే మనం ఇంతలా చించుకోవడం ఎందుకన్నది కొందరు సీనియర్స్ అభిప్రాయంగా తెలుస్తోంది. కానీ... బీఆర్ఎస్‌లోనే మరో వర్గం అభిప్రాయం మాత్రం దొరికిన ఛాన్స్‌ని వదులుకోవద్దన్నట్టుగా ఉందంటున్నారు. మొత్తంగా రైతు రుణమాఫీనైతే ఎట్టి పరిస్థితుల్లో వదలకుండా.... తాము తిరిగి పుంజుకునే ఆయుధంగా వాడుకోవాలన్నది బీఆర్ఎస్ ప్లాన్ అట.




## రుణమాఫీ పథకం-2024పై మంత్రి తుమ్మల సమీక్ష

హైదరాబాద్: రైతు రుణమాఫీ చేయడంలో క్షేత్రస్థాయిలో తలెత్తిన సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తుమ్మల వెల్లడించారు. ఈ మేరకు రుణమాఫీ పథకం-2024పై అధికారులతో మంత్రి తుమ్మల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు రుణమాఫీ సమస్యలు పరిష్కరించే దిశగా చేపట్టిన చర్యలను మంత్రి తుమ్మల అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ. 2లక్షలలోపు కుటుంబ నిర్ధారణ లేని 4,24,873 ఖాతాదారుల సమాచారాన్ని సేకరించేందుకు వీలుగా కొత్త యాప్ తీసుకువచ్చినట్లు మంత్రి తెలిపారు. వ్యవసాయాధికారులు స్వయంగా రైతుల ఇళ్లకు వెళ్లిగాని లేదా రైతు వేదికలు, కార్యాలయాల్లో అందుబాటులో ఉండి వారి ఫిర్యాదులు స్వీకరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వివరాలు తప్పుగా నమోదైన 1,44,545 ఖాతాలకు సంబంధించి ఇప్పటికే 41,322అకౌంట్లు సరి చేసినట్లు మంత్రి వెల్లడించారు. వివిధ బ్యాంకుల్లో ఉన్న ఖాతాదారుల అకౌంట్లలో ప్రభుత్వం జమ చేసే మొత్తాలను అన్నదాతలకు అందేటట్లు చర్యలు తీసుకోవాల్సిందిగా తుమ్మల ఆదేశాలు జారీ చేశారు.

# తెలుగు ప్రజలకు ఇది నిజంగానే కిక్కిచ్చే వార్తే!

## అన్ స్టాపబుల్‌కు సీఎం రేవంత్






హైదరాబాద్ : బాలకృష్ణ డైలాగ్ చెబితే ఫ్యాన్స్ కి రోమాలు నిక్కబొడుస్తాయి. మాస్ హీరోగా బాలకృష్ణను నిలబెట్టిన అంశాల్లో ఆయన డైలాగ్ డెలివరీ ఒకటి. అయితే ఆఫ్ స్క్రీన్ లో బాలకృష్ణ తడబడతాడు. ఆయన మంచి వ్యాఖ్యాత కాదు. పదాలు వెతుక్కుంటూ మాట్లాడతారు. బాలయ్య స్పీచ్ పలుమార్లు ట్రోల్స్ కి గురైంది. ఈ క్రమంలో బాలకృష్ణ హోస్ట్ గా టాక్ షో అనగానే అందరూ నవ్వుకున్నారు. అన్ స్టాపబుల్ అట్టర్ ఫ్లాప్ కావడం ఖాయమని డిసైడ్ అయ్యారు. కానీ బాలయ్య అందరి అంచనాలు తలకిందులు చేశాడు. బాలయ్య హోస్టింగ్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. తెలుగు ఎంటర్టైన్మెంట్ యాప్ ఆహాలో ప్రసారమైన అన్ స్టాపబుల్ సీజన్ వన్ గ్రాండ్ సక్సెస్. ఆయన గెస్ట్స్ ని ట్రీట్ చేసిన తీరు మెప్పించింది. అలాగే అన్ స్టాపబుల్ షోని ఇతర టాక్ షోలకు భిన్నంగా డిజైన్ చేశారు. గెస్ట్స్ లైఫ్ లో ఉన్న కాంట్రవర్సీలను బాలకృష్ణ తెరపైకి తెచ్చేవాడు. టాక్ షో ఆద్యంతం షోని సక్సెస్ చేయడంలో బాలకృష్ణ సక్సెస్ అయ్యాడు.అన్ స్టాపబుల్ షోలో టాప్ స్టార్స్ పాల్గొనడం మరొక విశేషం. మీడియా ముందుకు రావడానికి పెద్దగా ఇష్టపడని ప్రభాస్ అన్ స్టాపబుల్ షోకి వచ్చాడు. బాలకృష్ణ-ప్రభాస్ ఎపిసోడ్ చూసేందుకు ఆడియన్స్ పోటెత్తారు. దెబ్బకు ఆహా యాప్ సర్వర్లు క్రాష్ అయ్యాయి. ప్రభాస్ ఎఫైర్ రూమర్స్, పెళ్లి మేటర్ వంటి సెన్సిటివ్ క్వచ్చన్స్ బాలకృష్ణ అడిగాడు. ప్రభాస్ తనదైన శైలిలో సమాధానాలు చెప్పి తప్పించుకున్నాడు. అలాగే మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ వంటి టాప్ స్టార్స్ అతిథులుగా అన్ స్టాపబుల్ షోకి హాజరయ్యారు. బావ చంద్రబాబు నాయుడును బాలకృష్ణ ఇంటర్వ్యూ చేయడం విశేషం. చంద్రబాబు నాయుడు రాజకీయ చరిత్రలో మచ్చగా ఉన్న ఆగస్టు సంక్షోభం వీరి మధ్య చర్చకు వచ్చింది. ఎన్టీఆర్ ని అధికారం నుండి తప్పించడానికి గల కారణాలు చంద్రబాబు ఓపెన్ గా మాట్లాడాడు. గతంలో చంద్రబాబు ఎన్నడూ ఈ విషయం పై స్పందించింది లేదు. ఇలాంటి ప్రత్యేకతల కారణంగా అన్ స్టాపబుల్ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. రెండు సీజన్స్ సక్సెస్ఫుల్ గా పూర్తి చేసుకున్న అన్ స్టాపబుల్ షో సీజన్ 3కి సిద్ధం అవుతుంది. దసరా కానుకగా అన్ స్టాపబుల్ సీజన్ 3 ప్రారంభం కానుందట. సీజన్ 3కి గెస్ట్స్ లిస్ట్ మైండ్ బ్లాక్ చేసేలా ఉంది. తెలంగాణాలో వైభవం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన డైనమిక్ లీడర్ సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటారట. అలాగే సూపర్ స్టార్ రజినీకాంత్ సైతం పాల్గొనే అవకాశం కలదట. బాలకృష్ణ అల్లుళ్ళు, కూతుళ్ల సైతం హాజరయ్యే అవకాశం కలదట. ఈ న్యూస్ టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.

# మరో సారి కలవనున్న... గురు శిష్యులు!



## ఒకే వేదికపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు!

హైదరాబాద్ / అమరావతి : తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మరో సారి భేటీ కానున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిలు ఆదివారం (ఆగస్టు 25) ఒకే వేదికపైకి రానున్నారు. శాంతి సరోవర్ ద్విదశాబ్ది వార్షికోత్సవంలో ఇరువురు నేతలూ పాల్గొననున్నారు. అంటే నెలన్నర వ్యవధిలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇరువురూ రెండో సారి ముఖాముఖి చర్చలు జరిపే అవకాశం ఉంది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జులై నెలలో భేటీ అయిన సంగతి విదితమే. విభజన సమస్యలపై పరిష్కారం కోసం గత నెలలో ఇద్దరు ముఖ్యమంత్రుల మధ్య భేటీ జరిగింది. విభజన సమస్యలపై చర్చకు ఏపీ సీఎం చంద్రబాబు ప్రతిపాదించడం.. రేవంత్ రెడ్డి వెంటనే అంగీకరించడంతో వీరిద్దరి మధ్య భేటీ సుహృద్భావ వాతావరణంలో జరిగింది. గత నెల ఆరో తేదీన హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వేదికగా జరిగిన ఈ భేటీలో రెండు రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. విభజన సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం కమిటీలు వేయాలని నిర్ణయం తీసుకున్నారు. మంత్రులతో ఒక కమిటీని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల స్థాయిలో మరో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే గంజాయి సరఫరాను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని కూడా ఆ భేటీ సందర్భంగా రెండు ప్రభుత్వాలు నిర్ణయించాయి. జులై ఆరో తేదీ భేటీ తర్వాత ఈ నెల 25న మరో సారి ఇరువురు ముఖ్యమంత్రులూ ఎదురుప డుతున్నారు. హైదరాబాద్ వేదికగా జరిగే శాంతి సరోవర్ ద్విదశాబ్ది ఉత్సవాలలో ఇరువురూ పాల్గొంటు న్నారు. అధికారికంగా ఇరువురి మధ్యా చర్చలు జరుగుతాయన్న సమాచారం లేకపోయినప్పటికీ, ఒకే వేదికపై ఎదురుపడిన సందర్భంగా ఇరువురూ విభజన సమస్యల పరిష్కారంపైనే మాట్లాడుకునే అవకాశం ఉంది. అంటే గత నెల 6న జరిగిన భేటీకి కొనసాగింపుగానే చర్చలు ఉంటాయనీ, ఈ భేటీతో విభజన సమస్యల పరిష్కారం దిశగా మరో ముందడుగు పడుతుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# సంపాదకీయం

## హరీష్ వలలో రేవంత్ చిక్కాడా ?

రుణమాఫీ. గత నెల రోజులుగా ఈ వ్యవహారం తెలంగాణ ప్రభుత్వాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది. డిసెంబరు 9న ఒకేసారి రూ.2 లక్షల రైతుల రుణాలను మాఫీ చేస్తాం అని అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీ ఇది. ఇక రేవంత్ ఓ అడుగు ముందుకు వేసి కేసీఆర్ రూ.లక్ష మాత్రమే రుణమాఫీ అన్నాడు. మాఫీ అయిన వాళ్లు ఒకటి కాదు రూ.2 లక్షలు రుణం తెచ్చుకోండి అంటూ పిలుపునిచ్చాడు. ఎన్నికల్లో అధికారం దక్కించుకున్న తర్వాత సహజంగానే కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఈ విషయంలో వత్తిడి పెరిగింది. బీఆర్ఎస్ నుండి కూడా దీనిపై విమర్శలు మొదలయ్యాయి. ఈ లోపు పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి ఆగస్ట్ 15న రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తానని తెలంగాణ లోని అన్ని దేవుళ్ల మీద ఒట్టేసి చెప్పాడు. ఎన్నికల తర్వాత మరింత వత్తిడి పెరిగింది. వాస్తవంగా బీఆర్ఎస్ తొలి ప్రభుత్వంలో ఇచ్చిన హామీ మేరకు రూ.లక్ష వరకు రుణాలు రూ.16,144 కోట్లు నాలుగు విడతల్లో చేశారు. రెండోసారి హామీ ఇచ్చినా కరోనాతో నిధుల సమస్య ఏర్పడింది. రూ.లక్ష వరకు రుణాలు రూ.19,440 కోట్లకు గాను రూ.13,000.51 కోట్లు చెల్లించారు. రుణమాఫీ ఒకేసారి చేయడం అసాధ్యం కావడంతో పాటు, మిగిలిన పథకాల అమలుకు సమస్యలు వస్తాయనే బీఆర్ఎస్ హయాంలో విడతల వారీగా చేశారు. అయితే శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.41 వేల కోట్ల రుణమాఫీని రూ.31 వేల కోట్లకు కుదించి మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది. ఇది అసాధ్యం అని తెలిసి బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు రుణమాఫీ చేస్తే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరాడు. హరీష్ రావు సవాల్ ను అంచనా వేయడంలో సీఎం రేవంత్ గురి తప్పాడు. రైతుభరోసా కింద రూ.15 వేల కోట్లను పక్కన పెట్టినా రుణమాఫీ సాధ్యం కాలేదు. మూడు విడతల్లో రూ.17,869 కోట్లు రుణమాఫీ చేసి రుణమాఫీ పూర్తయిందని సీఎం హెూదాలో రేవంత్ ప్రకటించడంతో రైతుల్లో గందరగోళం చెలరేగింది. రాష్ట్రవ్యాప్తంగా రైతులు రోడ్డెక్కి శవయాత్రలకు దిగడంతో ప్రభుత్వంలో గందరగోళం రేగింది. దీంతో మరో 12 వేల కోట్లు రుణమాఫీ చేస్తామని, సాంకేతిక కారణాలు, రైతులను గుర్తించడంలో పొరపాట్ల మూలంగా సమస్య ఏర్పడిందని మంత్రులు మీడియా సమావేశాలు పెట్టి సర్దిచెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు రూ.17 వేల కోట్లు రుణమాఫీ చేసినా అందరు రైతులకు కాకపోవడం, రుణమాఫీ కాని రైతులు ఎక్కువగా ఉండడంతో రుణమాఫీ విషయంలో విమర్శలతో పాటు, రైతుభరోసా ఇవ్వకుండా నిధులు మళ్లించారని అపవాదు మీదపడింది. రుణమాఫీ విషయంలో ఎలాంటి కసరత్తు చేయకుండా సవాళ్లు విసిరారని ఒక వాదనతో పాటు, వ్యూహాత్మకంగా హరీష్ రావు విసిరిన వలలో రేవంత్ చిక్కారని మరో వాదన వినిపిస్తుంది. మొత్తానికి కాంగ్రెస్ రుణమాఫీ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించి ఉండాల్సిందని చర్చ నడుస్తున్నది.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనమే అందించాలి...

స్వయంగా తిని మరి భోజనం నాణ్యతను పరీక్షించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ...





శామీర్ పేట (గరుడ వార్త): విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యమైన పౌష్టిక ఆహారంగా తయారు చేసి మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయెందర్ రెడ్డి అన్నారు. అలియాబాద్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కొరకు వండిన మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా తాను తిని మరి పరీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించే సన్నబియ్యంతో మధ్యాహ్నం భోజన పథకం నిర్వహణను పరిశీలించేందుకు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టరు శామీర్ పేట్ మండలం లోని అలియాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు సన్నబియ్యంతో అందించే మధ్యాహ్న భోజనం రుచికరంగా, పరిశుభ్రంగా ఉండాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అదనపు కలెక్టరు సూచించారు. పాఠశాలలోని తరగతి గదులను తిరిగి పరిశీలించారు. వంటశాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా కష్టపడి చదువుకుంటే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని తెలిపారు. మధ్యాహ్న భోజనం రోజు పెడుతున్నారా, భోజనం ఏలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అదనపు కలెక్టరు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ యాదగిరి రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 28 న ప్రారంభం కానున్న ఎస్ జి ఎఫ్ 68వ జోనల్ లెవెల్ టోర్నమెంటు



శామీర్ పేట, (గరుడ వార్త) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్) 68 వ జోనల్ లెవెల్ టోర్నమెంట్ ఈనెల 28న ప్రారంభిస్తున్నట్లు జోనల్ సెక్రెటరీ గుర్రం సత్తిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 68 వ ఎస్ జి ఎఫ్ శామీర్ పేట జోనల్ లెవెల్ టోర్నమెంట్, సెలక్షన్స్ (శామీర్ పేట, మూడు చింతలపల్లి మండలాలు) ఈనెల 28 నుంచి 30 వరకు జరుగనున్నట్లు తెలిపారు. వాలీబాల్, ఖో ఖో, కబడ్డీ క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 28న వాలీబాల్, 29న ఖో ఖో, 30న కబడ్డీ క్రీడలు ఉంటాయని తెలిపారు. ఈ క్రీడలలో అండర్ 14 బాయ్స్ అండ్ గర్ల్స్, అండర్ 17 బాయ్స్ అండ్ గర్ల్స్ కు క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అండర్ 14-01-2011 తర్వాత జన్మించిన వారు, ఆరో తరగతి పైవాళ్లు అర్హులని, అండర్ 17 ఇయర్స్ 01-01-2008 తర్వాత జన్మించి ఆరవ తరగతి పై వాళ్లు అర్హులన్నారు. ఒక ఏజ్ కేటగిరీలో ఆడిన వాళ్ళు ఇంకో ఏజ్ కేటగిరీలో ఆడకూడదని, ఈ క్రీడలలో పాల్గొను క్రీడాకారులు స్కూల్ బోనఫైడ్ తో పాటు ఆధార్ కార్డ్ తప్పనిసరిగా సబ్మిట్ చేయాలన్నారు. ఈ క్రీడలలో పాల్గొనే జట్ల వివరాలు 27 ఉదయం 10 గంటల లోపు జడ్పీహెచ్ఎస్ తుంకుంటలో జోనల్ సెక్రెటరీ సత్తి రెడ్డి కి అందించాలని, అదే రోజు ఉదయం 11 గంటలకి డ్రా తీయనున్నట్లు వివరించారు. ఇతర వివరాల కొరకు ఈ ఫోన్ నెంబర్లలలో సంప్రదించాలని 9490148731, 9246190425 సూచించారు. ఈ క్రీడలను మజీద్ పూర్ ఎక్స్ రోడ్ రాజీవ్ రహదారి ప్రక్కన జైన్ హెరిటేజ్ కేంబ్రిడ్జ్ స్కూల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

## మహాలక్ష్మి వెంచర్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

శామీర్ పేట, (గరుడ వార్త) : తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయంజాల్ 16 వార్డు లోనున్న మహాలక్ష్మి వెంచర్ ను మున్సిపల్ కమిషనర్, అధికారులు పరిశీలించారు. శామీర్ పేట మండలం తూముకుంట మున్సిపల్ దేవరియంజాల్ పరిధిలోని మహాలక్ష్మి వెంచాను కమిషనర్ వెంకట గోపాల్ మున్సిపల్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఇటివల కురిసిన భారీ వర్షాల తో ఓపెన్ ప్లాట్లలో వర్షపు నీరు నిలిచిపోయాయి. ఈ నీటితో కాలనీ వసూలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారని తెలిసిన కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. యుద్ధ ప్రాతిపాదికన కాలనీలోని మ్యాన్ హెూల్స్ ను, 14 వ వార్డులోని గోదాము ప్రక్కన గల వరద నీటి కాలువ ను, అందులో ఉన్న చెట్లు, చెత్తను పూర్తిగా తొలగించి వరద నీరు సాఫీగా దిగువ ప్రాంతాలకు వెళ్ళేలా తగు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## బంగారు బాల్యం.. భవిత భద్రం



వికారాబాద్ : బాల్యం ఎంతో విలువైంది. వీరిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. తెలియని తనం, కోపం తదితర కారణాలతో కొందరు పిల్లలు ఇంటినుంచి వెళ్లిపోతున్నారు. తిరిగి వద్దామన్నా సరైన అవగాహన లేక ఎక్కడో ఓ చోట పని చేసుకుంటూ జీవితాన్ని వెళ్లదీస్తున్నారు. ఇలాంటి పిల్లలను గుర్తించి వీరిని తల్లిదండ్రులకు అప్పగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏటా 'ఆపరేషన్ ముస్కాన్' కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈనెల 1న ప్రారంభించగా 31 వరకు కొనసాగుతుంది. దీనికి సంబంధించి కథనం.

సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు..

తప్పిపోయిన 6 నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి వారిని తిరిగి తల్లిదండ్రులకు అప్పగించాలని సుప్రీంకోర్టు 2016లో రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. దీనికి అనుగుణంగా ఏటా జులై నెలలో ఆపరేషన్ ముస్కాన్, జనవరిలో ఆపరేషన్ స్మైల్‌ను రెండు నెలలపాటు నిర్వహిస్తున్నారు. బాలల కోసం పోలీసు శాఖ, బాల రక్షా కమిటీ, చైల్డ్ లైన్ కమిటీ, బాలల పరిరక్షణ విభాగం, స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి.

వసతి గృహాల్లో 120 మంది ఆశ్రయం

బాలల కోసం ప్రత్యేకంగా జిల్లాలో 4 వసతి గృహాలున్నాయి. వికారాబాద్ ఎన్నెపల్లిలో బాలికలకు, ధన్నారంలో బాలలకు ఉన్నాయి. మోమిన్‌పేటలో హెల్ప్ ఆల్ సొసైటీ ఉంది. పరిగిలో ప్రత్యేకంగా బాలికలకు బాల సదనం, వికారాబాద్‌లో శిశుగృహ ఉంది. అన్ని కేంద్రాల్లో కలిపి సుమారుగా 120 మంది ఆశ్రయం పొందుతున్నారు.

మూడు బృందాలతో ప్రత్యేక తనిఖీలు

జిల్లాలో తనిఖీలు నిర్వహించటానికి మూడు బృందాలు ఏర్పాటు చేశారు. వీటిలోని సభ్యులు అనుమానం ఉన్న ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తారు. పిల్లలను గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలిస్తారు. బడిఈడు పిల్లల్ని బడుల్లో చేర్పిస్తారు. ముఖ్యంగా ఇటుక బట్టీలు, పరిశ్రమలు, దుకాణాలు, హెూటళ్లపై దృష్టి సారించి తనిఖీలు చేస్తున్నారు.

బాలల రక్షణ కోసం ప్రత్యేకంగా కమిటీని నియమించారు. దీన్లో స్టేషన్ హౌజ్ ఆఫీసర్, ఏఎస్ఐ, కానిస్టేబుళ్లు, కార్మిక, రెవెన్యూ శాఖాధికారులు, సభ్యులుగా ఉంటారు. దొరికిన పిల్లల్ని 24 గంటల్లో జిల్లాలోని చైల్డ్‌లైన్ 1098కు అప్పగిస్తారు.

శాఖల సమన్వయంతో తనిఖీల నిర్వహణ– వెంకటేశం, ఛైర్మన్, బాలల సంక్షేమ కమిటీ, వికారాబాద్

జిల్లా సంక్షేమ అధికారి నేతృత్వంలో అన్ని శాఖల యంత్రాగం సమన్వయంతో తనిఖీలు చేపడుతున్నాం. గత సంవత్సరం జిల్లాకు చెందిన 40 మంది పిల్లలు తప్పిపోయారు. వీరిని గుర్తించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

పనిలో చేర్చుకుంటే చట్టపరంగా చర్యలు – ధనసిరి ప్రకాశ్, బాలల సంక్షేమ కమిటీ సభ్యుడు, వికారాబాద్‌బాలలు తమ బాల్యాన్ని బడిలోనే గడిపే విధంగా చూడాలి. బాలలతో పనులు చేయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవు. పిల్లల్ని పోషించలేని పరిస్థితి ఉన్న తల్లిదండ్రులు బాల రక్షా కమిటీ కార్యాలయాన్ని సంప్రదించి తగిన సలహాలను, సూచనలు పొందవచ్చు. పిల్లల చదువులకు అండగా ఉంటాం.

## మొదటి త్రైమాసికం.. ఉత్పత్తి ఆశాజనకం

గోదావరిఖని: సింగరేణి సంస్థ మొదటి త్రైమాసికంలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి చేరువగా వచ్చింది. మొదటి మూడు నెలల్లో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి కేవలం 61 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంది. జూన్ నెలలో 101 శాతం ఉత్పత్తి సాధించింది. సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకుంది. అందులో మొదటి త్రైమాసికంలో 17.31 మిలియన్ టన్నులకు గాను 16.70 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించింది. జూన్ నెలలో 5.40 మిలియన్ టన్నుల కు గాను 5.50 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. వచ్చే



తొమ్మిది నెలల్లో సాధించాల్సిన ఉత్పత్తిపై లక్ష్యాలు నిర్దేశించుకుంది.

మూడు డివిజన్లలో వంద శాతం

సింగరేణి మొదటి త్రైమాసికంలో మూడు డివిజన్లు వందశాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాయి. ఇల్లెందు, బెల్లంపల్లి, రామగుండం-2 డివిజన్లు మూడు నెలల్లో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకున్నాయి. ఇల్లెందు 109 శాతం, బెల్లంపల్లి 103, రామగుండం-2 138 శాతం ఉత్పత్తి సాధించాయి. మణుగూరు 97, ఆర్జీ-3 95 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించగా రామగుండం-1, కొత్తగూడెం డివిజన్లు 93 శాతం బొగ్గు ఉత్పత్తి చేపట్టాయి. మిగతా ఏరియాలు ఆశించిన స్థాయిలో ఉత్పత్తి చేపట్టలేకపోయాయి.

వినియోగదారులకు కొరత లేకుండా...వినియోగదారులకు ఎలాంటి కొరత లేకుండా సింగరేణి సంస్థ బొగ్గు రవాణా చేస్తుంది. విద్యుదుత్పత్తికి సరిపడా బొగ్గును ఎప్పటికప్పుడు రవాణా చేస్తుంది. వర్షాకాలం కావడంతో బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇప్పటి వరకు తక్కువ వర్షపాతం నమోదు కావడంతో ఉపరితల గనుల్లో ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం ఎదురుకాలేదు.


## ఆర్ఆర్ఆర్ భూసేకరణ వేగిరం

నల్గొండ : రాజధాని హైదరాబాద్‌తో పాటూ పరిసర ప్రాంతాలకు సంబంధించి వచ్చే 30 ఏళ్ల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతమున్న బాహ్య వలయ రహదారి (ఓఆర్ఆర్)కి అవతల 30 కి.మీ. దూరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించనున్న ప్రాంతీయ వలయ రహదారి (ఆర్ఆర్ఆర్) నిర్మాణ ప్రక్రియ ఉమ్మడి జిల్లాలో వడివడిగా సాగుతోంది. ప్రాజెక్టు నిర్మాణానికి త్వరితగతిన నిధులు మంజూరు చేయాలని సంబంధిత రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెట్‌టడ్డి ఇటీవలే కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరడంతో ఆయన సమ్మతించారు. మంత్రి ప్రత్యేక దృష్టితో ఉత్తర, దక్షిణ భాగాల భూ సేకరణ ప్రక్రియను వచ్చే మూడు, నాలుగు నెలల్లోనే పూర్తి చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తర భాగానికి సంబంధించి యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్, భువనగిరి ఆర్డీవోల పరిధిలో భూ సేకరణ జరుగుతుండగా..దక్షిణ భాగానికి సంబంధించి యాదాద్రి, నల్గొండ జిల్లాల పరిధిలో భూ సేకరణ క్రతువు సాగనుంది. యాదాద్రి కలెక్టరు హనుమంత్ కే.జెండగే ఇటీవలే అధికారులతో సమీక్షించి సాధ్యమైనంత తొందరగా ఉత్తర భాగం భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

ఉమ్మడి జిల్లాలో 100 కి.మీ. వరకు

ఉత్తర మార్గంలో సంగారెడ్డి నుంచి నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, జగదేవ్‌పూర్, తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ వరకు 158 కి.మీ.మేర రహదారిని నిర్మించనున్నారు. ఈ మార్గం ఉమ్మడి జిల్లాలో 59.33 కి.మీ. మేర ఉండనుంది. అధికారులు ప్రతిపాదించిన మేరకు ఈ మార్గం ఐదు మండలాలు, 24 గ్రామాల మీదుగా వెళుతోంది. 649.85 హెక్టార్ల భూమి అవసరం అవుతుందని అంచనా వేయగా.. ఇప్పటికే అధికారులు 599.71 హెక్టార్ల భూ సేకరణకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేశారు. ఇంకా 50.06 హెక్టార్లకు నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది.

భువనగిరి మండలం రాయిగిరితో (కలెక్టరేట్‌కు ఎదురుగా)పాటూ చౌటుప్పల్, వలిగొండ వద్ద ఇంటర్‌ఛేంజ్ జంక్షన్లు రానున్నాయని



గతంలోనే అధికారులు నిర్ణయించారు. అయితే రాయిగిరి వద్ద అలైన్‌మెంట్‌ను మార్చాలని రైతులు గత కొన్నాళ్లుగా ఆందోళన చేస్తున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలకు ముందు భువనగిరి ఎంపీగా ఉన్న ప్రస్తుత ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని అలైన్‌మెంట్‌ను మార్చి తమకు న్యాయం చేయాలని కోరారు. దీంతో రైతులకు అన్యాయం జరగకుండా రహదారి నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు చేపడుతామని ఆయన హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆయనే మంత్రిగా ఉండటంతో తమకు న్యాయం దక్కుతుందని ఇక్కడి ప్రజలకు భావిస్తున్నారు. దీనిపై రైతులు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించగా..అలైన్‌మెంట్ మార్చి దీనిపై ఉన్న స్టేను ఎత్తివేసే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. మరోవైపు దక్షిణ భాగం చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపూర్, మర్రిగూడ, ఆమన్‌గల్, షాద్‌నగర్, కంది, సంగారెడ్డి వరకు నిర్మించను న్నారు. ఇది సుమారు 181 కి.మీ. వరకు ఉండగా.. యాదాద్రి, నల్గొండ జిల్లాల్లోని చౌటుప్పల్, నారాయణపూర్, మర్రిగూడ మండలాల్లో కలిపి సుమారు 40 కి.మీ.మేర రహదారి ఉండే అవకాశం ఉందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. 250కి పైగా హెక్టార్ల భూమి అవసరం అవుతుందని భావిస్తుండగా..మరికొన్ని రోజుల్లో దక్షిణ భాగం భూ సేకరణపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఉత్తర, దక్షిణ భాగాలను కలిపి ఉమ్మడి జిల్లాలో ఆర్ఆర్ఆర్ 100 కి.మీ. మేర విస్తీర్ణంలో ఉంటుందని తెలిసింది.

# భూమి పూజ చేసి... పనులు మరిచి

వేములవాడ: ఏటా వర్షాకాలంలో కాలువ పొంగితే చాలు రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో దాదాపు ఎనిమిది గ్రామాలతో పాటు ఆ మార్గం వైపు వెళ్లేవారు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సమస్యను గుర్తించి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అయినా అధికారుల అలసత్వం, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా వంతెన నిర్మాణం చేపట్టని దుస్థితి నెలకొంది.

వేములవాడ పట్టణ శివారు మల్లారం రోడ్డులోని కట్టు కాలువ ఏటా భారీ వర్షాలకు పొంగి పొర్లడంతో ఈ ప్రాంత గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కల్వర్టు వద్ద హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రతిపాదన చేశారు. దాదాపు రెండేళ్ల క్రితం రూ.2.5 కోట్లు మంజూరు కాగా అప్పటి ఎమ్మెల్యే రమేశ్‌బాబు వంతెన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. దీంతో పాటు శాత్రాజుపల్లి వద్ద వంతెన నిర్మాణానికి కూడా భూమిపూజ చేశారు. ఇందులో శాత్రాజుపల్లి వద్ద వంతెన పూర్తి కాగా ఈ వంతెన నిర్మాణం ఏడాది గడిచినా ముందుకు సాగడం లేదు.

**ఎనిమిది గ్రామాల ప్రజలకు అవస్థలు**

పట్టణ శివారులోని కల్వర్టు భారీ వర్షం కురిస్తే భీమేశ్వర కాలువ నీటితో పాటు వ్యవసాయ పంట పొలాల నుంచి భారీగా వరద ఈ కాలువలో చేరుతుంది. దీంతో ఈ కల్వర్టు వద్ద భారీగా వరద చేరడంతో రవాణా స్తంభించిపోతుంది. కల్వర్టు అవతలి వైపు ఉన్న జయవరం,



మల్లారం, హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి గ్రామాలతో పాటు కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి వైపు వెళ్లే గ్రామాల ప్రజలు, మరోవైపు చందుర్తి మండలంలోని ఎన్గల్, బండపల్లి వైపు వెళ్లే గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడుతుంటారు. ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల మీదుగా వేములవాడ, సిరిసిల్ల పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ మార్గం మీదుగా నిజామాబాద్ జిల్లా సిరికొండకు రవాణా సౌకర్యం నిలిచిపోతుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ వంతెన నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల ఈ ప్రాంత గ్రామాలకు చెందిన వారి నుంచి నిరసన వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా వంతెన నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలకు కోరుతున్నారు.

**వర్షాకాలం తరవాత పనులు ప్రారంభిస్తాం**

వంతెన నిర్మాణ పనులు వర్షాకాలం తరవాత చేపట్టడం జరుగుతుంది. గుత్తేదారు కొన్ని కారణాల వల్ల పనులు చేపట్టలేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో భారీ వర్షాలు కురిస్తే పనులు సాగవు. ప్రజలు ఇబ్బందులు పడతారు. ముందుగా కల్వర్టు వద్ద డైవర్షన్ రోడ్డు నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా వంతెన పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం. శాంతయ్య, డీఈఈ, ఆర్అండ్‌బీ, వేములవాడ

# ప్రతి మొక్కకూ ఒక లెక్క.

కొత్తగూడెం : పర్యావరణ పరిరక్షణతోనే ప్రకృతి సమతుల్యత సాధ్యమవుతుంది. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచాలనే లక్ష్యంతో ప్రభు త్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న 'వన మహోత్సవం' కార్యక్రమం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ముమ్మరంగా సాగుతోంది. భద్రాద్రి జిల్లాలో ఇప్పటికే లక్ష్యానికి మించి మొక్కలు నాటగా.. ఖమ్మం జిల్లాలో 84 శాతం పూర్తయ్యింది. మిగతా మొక్కలు నాటేందుకు ప్రభుత్వ శాఖల అధికారులు యత్నిస్తున్నారు.

**లక్ష్యాలు చేరని పురపాలికలు**

ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా ఉభయ జిల్లాల్లోని మున్సిపా లిటీలు మొక్కలు నాటేందుకు ఆసక్తి చూపించినట్లు కనిపించటం లేదు. భద్రాద్రి జిల్లాలోని నాలుగు పురపాలికలకు అయిదు లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్ణయించగా.. సంబంధిత అధికారులు 3.37లక్షల మొక్కలు మాత్రమే నాటారు. ఖమ్మం జిల్లాలోని ఒక నగరపాలిక, మూడు పురపాలికల్లో 4.78 లక్షల లక్ష్యానికి కేవలం 1.40 లక్షల మొక్కలు నాటడంతోనే సరిపెట్టుకున్నారు. ఉభయ జిల్లాల్లోని అటవీ, డీఆర్‌డీఏ శాఖల అధికారులు లక్ష్యానికి మించి మొక్కలు నాటారు.

**నాటిన వాటిని సంరక్షించేలా..**

గతంలో హరితహారం కింద చేపట్టిన మొక్కల పెంపకం మిశ్రమ ఫలితాలనిచ్చింది. ఉభయ జిల్లాల్లోని అధికార యంత్రాంగం మొక్కలు నాటడంపై పెట్టిన శ్రద్ధ వాటి సంరక్షణపై చూపటం లేదనే విమర్శలున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది చేపట్టిన వన మహోత్సవంలో.. నాటిన ప్రతి మొక్కను రక్షించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇందులో ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేస్తోంది. జియో ట్యాగింగ్ యాప్‌లో ఎక్కడెక్కడ ఎన్ని మొక్కలు నాటారనే వివరాలు పొందుపరుస్తోంది. ఎక్కడైతే మొక్కలు నాటుతారో అక్కడ నావిగేషన్‌తో ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో నిక్షిప్తపరుస్తోంది. తద్వారా నాటిన మొక్క ఏవిధంగా ఉందనేది ఆన్‌లైన్ ఆధారంగా తెలుసుకోవచ్చు.

**క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇలా..**




ప్రతి జిల్లాలోని భూవిస్తీర్ణంలో 33 శాతం అడవులు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏటా పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతోంది. అందులో భాగంగా ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో 32 లక్షలు, భద్రాద్రి జిల్లాలో 65 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కీలకపాత్ర పోషించగా.. అటవీ, రెవెన్యూ, పోలీసు, సింగరేణి, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, నీటిపారుదల, పశుసంవర్ధక, వ్యవసాయ, ఉద్యాన, మహిళా సంక్షేమం, ఎక్సైజ్, విద్యాశాఖలు భాగమయ్యాయి. కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా సంబంధిత అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

# గడప చేరినా.. గొంతు తడవడం లేదు

పరిగి: ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన 'మిషన్ భగీరథ' జిల్లాలో ఇంకా ప్రజలకు చేరువ కావడంలేదు. పట్టణాల విషయం ఎలాఉన్నా కనీసం పల్లె గొంతునూ తడపలేకపోతోంది. నిజానికి ఈ నీటిలో అనేక ఖనిజ లవణాలున్నా తాగేందుకు చాలా మంది ఇష్టపడటం లేదు. రూ.20చెల్లించి డబ్బా నీటినే కొనుగోలు చేస్తున్నారు. ఇందుకు ప్రధానంగా 'అవగాహన లోపం' ఒక కారణమైతే, పంచాయతీల నిర్వహణ లేమి మరో కారణంగా నిలుస్తోంది.

**నిల్వ సదుపాయాలేవీ..**

శ్రీశైలం రిజర్వాయరు నుంచి పరిగి మండలం రాఘవాపూర్ సమీపాన ఏర్పాటు చేసిన నీటిశుద్ధి ప్లాంటుకు సరఫరా జరుగుతోంది. అక్కడి నుంచి జిల్లాలోని పంచాయతీలకు పంపిణీ చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా నీటిని నిల్వ చేసుకునే సదుపాయం మున్సిపాలిటీలతో సహా గ్రామాల్లో లేదు. దీంతో పంచాయతీల్లోని మోటార్లతో కలిపి సరఫరా చేస్తున్నారు. తాండూరులో అస్తవ్యస్తం

తాండూరు పట్టణ వాసులకు నిత్యం తాగునీటి సరఫరాకు రెండేళ్ల కిందట భగీరథ ట్యాంకులు నిర్మించారు. పైపు లైన్లు పూర్తి కాలేదు. ఈ నీరు వస్తుందనే ధీమాతో ఏళ్ల నుంచి ప్రజల దాహార్తిని తీర్చిన కాగ్నా నది ఒడ్డున ఉన్న పాత, కొత్త రెండు పంప్‌హౌస్‌లను మూసివేశారు. అటు పంప్ హౌస్‌లు పనిచేయక, ఇటు భగీరథ నీరు సక్రమంగా రాక పట్టణ వాసులు నానా అవస్థలు పడుతున్నారు.

**ఇలా చేస్తే మేలు** అధిక నీటి నిల్వ సామర్థ్యం కలిగిన భూ ఉపరితల ట్యాంకుల ఏర్పాటు. లేని పక్షంలో పంచాయతీ బోర్ల నీటిని, భగీరథ నీటిని వేర్వేరు సమయాల్లో సరఫరా చేయాలి.

గ్రామాల్లో భగీరథ నీటి ప్రయోజనాలను ప్రయోగాత్మకంగా వివరించడం.

లీకేజీలను సరిచేయడం.

పల్లెల్లో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ అవసరం.

ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం

– సుబ్రహ్మణ్యం, డీఈఈ, నీటి సరఫరా విభాగం

ప్రతి ఒక్కరూ తాగాల్సిన స్వచ్ఛమైన నీరు మిషన్ భగీరథ. డబ్బా నీటిని కొనుగోలు చేయడం అనారోగ్యాన్ని డబ్బులు పెట్టి కొనుగోలు చేసినట్లే అవుతుంది. నీటి వినియోగం పై సందేహాలను నివృత్తి చేస్తూ ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం.

మిషన్ భగీరథ ప్రారంభం – 2018

నీటి సరఫరా–

శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్

ఎంత దూరం– 231 కి.మీ.

ఎక్కడికి సరఫరా– పరిగి మండలం

రాఘవాపూర్ సమీప నీటి సంపు

పంచాయతీలు– 566

రోజుకు నీటిశుద్ధి – 1.35లక్షల ఎంఎల్‌డీ

భూ ఉపరితల ట్యాంకులు– 806

ఏర్పాటు చేసిన నల్లా కనెక్షన్లు– 2.07లక్షలు

మరమ్మతులు చేపట్టాల్సినవి – 40,000

పైప్‌లైన్ల ఏర్పాటు– 1920.17కి.మీ

ఉమ్మడి రంగారెడ్డి కింద చేసిన వ్యయం – రూ.1800కోట్లు

# నిధులు రాక.. అధికారులు లేక!



కరీంనగర్ : పురపాలికలు, నగరపాలిక తరహాలో గ్రామాల్లో సైతం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. పంచాయతీల పరిధిలో నిధుల కొరత ఉంటుండటంతో ప్రజలందరికి సంబంధించిన పనులపై శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ(సుడా) ప్రత్యేక దృష్టి సారించి ఆ దిశగా కసరత్తు చేసింది. ఆదాయ మార్గాలను అంచనా వేసుకుంటూ ఒక్కో పని చేసుకుంటూ వెళ్తోంది. రహదారులు, వీధిదీపాలు, హైమాస్ట్ లైట్లు, వాకింగ్‌ట్రాక్‌లు, ఓపెన్‌జిమ్‌లు వంటివి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు రూ.95.22 లక్షలు కేటాయించగా, ఎనిమిది పనులు పూర్తి చేశారు. బదిలీల కారణంగా పాత అధికారులు వెళ్లి.. కొత్త అధికారులు రావడంతో కొంత జాప్యం జరిగింది. మరిన్ని నిధులు సమకూరితే పనుల్లో వేగం పెరుగుతుంది.

**ఎల్ఆర్ఎస్ నిధులపై ఆశలు**

సుడా పరిధిలో అభివృద్ధి పనులు పరుగు పెట్టాలంటే నిధుల సమీకరణ ప్రధాన సమస్యగా మారింది. ప్రస్తుతం భవనాలు, ఇతర అనుమతులతోనే ఆదాయం రాగా కొత్తగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కరించడంతో నిధులు వస్తాయనే ఆశతో ఉన్నారు. ఉన్న నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. వీటి బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.

**బదిలీల కారణంగా..**

సాధారణ బదిలీల్లో భాగంగా, గతంలో పని చేసిన ఒకరిద్దరు ఇంజినీరింగ్ అధికారులు వెళ్లిపోవడంతో కొత్త అధికారులు సుడాకు రావడంలో జాప్యం జరిగింది. రెండు నెలలుగా ఏఈ లేకుండాపోయారు. డీఈఈ కూడా రేపో, మాపో బాధ్యతలు స్వీకరించే అవకాశముంది. పనులు పూర్తయిన చోట పనులను తనిఖీ చేసి బిల్లులు మంజూరు చేయాల్సి ఉంది.

**పూర్తయిన పనులు...**

చొప్పదండి మండలం కొలిమికుంట గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు.

బొమ్మకల్ శ్రీపురంకాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

చాకుంటలో రూ.10 లక్షలతో వీధిదీపాలు

గుంటూరుపల్లి నుంచి కొనేరుపల్లి ఐకేపీ సెంటర్ వరకు రూ.5 లక్షలతో వీధిదీపాలు

కొత్తపల్లి మండలం చింతకుంటలో రూ.6 లక్షలతో అయిదు హైమాస్ట్ వీధిదీపాలు

ఎలగందల్‌లో రూ.5 లక్షలతో ఓపెన్‌జిమ్ ఏర్పాటు

కరీంనగర్ రూరల్ మండలం బహదూర్‌పేటలో రూ.5 లక్షలతో అయిదు హైమాస్ట్ లైట్లు

మానకొండూర్ మండలం ముంజంపల్లిలో రూ.2.22 లక్షలతో హైమాస్ట్ లైట్లు.

పెండింగ్‌లో ఉన్నవి...

వెదిరలో రూ.15 లక్షలతో ఓపెన్‌జిమ్, వాకింగ్‌ట్రాక్, వీధి దీపాలు

కొక్కరకుంటలో రూ.5 లక్షలతో ఓపెన్‌జిమ్

దేశ్‌రాజ్‌పల్లిలో రూ.10 లక్షలతో వాకింగ్‌ట్రాక్, ఓపెన్‌జిమ్

కిష్టాపూర్‌లో రూ.4 లక్షలతో ఓపెన్‌జిమ్, హైమాస్ట్ లైటు

చాకుంటలో రూ.5 లక్షలతో ఓపెన్‌జిమ్


ఓద్యారంలో రూ.3 లక్షలతో ఓపెన్‌జిమ్

అధికారులను ఆదేశించాం

అత్యవసరంగా, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం. ఇటీవల వైస్ ఛైర్మన్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి సమీక్షించాం.

కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఛైర్మన్, సుడా, కరీంనగర్

# సొంత గూడు ఎంత దూరం!



పెద్దపల్లి: ఇళ్లు లేని అర్హులైన పేదలందరికి ఇంటి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరమ్మ' ఇళ్ల పథకాన్ని ప్రకటించింది. గతేడాది డిసెంబరు 28 నుంచి ఈ సంవత్సరం జనవరి 6 వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దరఖాస్తులు స్వీకరించారు. ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు త్వరలోనే తొలి విడత కింద ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించడంతో ఆశావహ లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మొత్తం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 12 నియోజకవర్గాలకు 42 వేల ఇళ్లు మొదటి దశలో మంజూరవనున్నాయి. ఒక్కో ఇంటికి ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.6 లక్షలు, ఇతర వర్గాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందనుం ది. జిల్లాస్థాయిలో అధికారులు మాత్రం ఇంకా ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని పేర్కొంటున్నారు. ప్రజాపాలన వెబ్‌సైట్ ప్రస్తుతం తెరచుకోకపోవడంతో అర్హులైన కొత్త దరఖాస్తుదారులూ నిరాశకు లోనవుతున్నారు. తమకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

**వేలల్లో ఇళ్లు.. లక్షల్లో దరఖాస్తులు**

ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రజాపాలన కింద అర్జీలను స్వీకరించింది. సొంత స్థలం ఉండి ఇల్లు లేనటువంటి వారు ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. మహిళ పేరున పథకం అమలు చేస్తామని ప్రకటించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 7,09,923 దరఖాస్తులు వచ్చాయి. నియోజకవర్గానికి మొదటి దశలో 3,500 చొప్పున 42 వేల మందికి ఇళ్లు మంజూరు అవ్వనున్నాయి. ఈ లెక్కన ఒక్కో ఇంటికి 1,690 మంది దరఖాస్తుదారులు పోటీ పడుతుండగా ఇందులో అర్హులను ఎంపిక ఎలా అనేదానిపై మంత్రులు, అధికారులు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నారు.

గత ప్రభుత్వం రెండు పడకల గదుల నిర్మాణాలను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రారంభించనప్పటికి పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలోని రెండు, మూడు నియోజకవర్గాల్లో అక్కడక్కడా పంపిణీ చేశారు. మిగిలిన నియోజకవర్గాల్లో ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. కొన్ని చోట్ల పూర్తయి లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికి మౌలిక వసతులు లేవనే కారణంతో వారికి ఇళ్లు కేటాయించలేదు. ఆ ఇళ్లను కూడా పూర్తి చేసి అర్హులైనవారికి ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

# మీకెందుకు.. ముందు చేరండి!

హైదరాబాద్: కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సుకున్న డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు అదనపు సీట్ల పేరుతో మాయాజాలానికి తెరతీశాయి. తమ కళాశాలలో అదనంగా సీట్లు పెంచుకునేందుకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి అనుమతి ఇచ్చిందంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షల్లో డొనేషన్లు తీసుకుంటున్నాయి. మూడో కౌన్సెలింగ్ పూర్తయినా సీటు రాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్ శివారులోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగు రోజుల క్రితం సీట్లు రాని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిరసనకు దిగారు. డబ్బు వెనక్కి ఇస్తామంటూ యాజమాన్యం చెప్పినా సీటే కావాలంటూ పట్టుబట్టారు. స్పాట్ అడ్మిషన్లలోపు అనుమతులు తీసుకువస్తామంటూ వారిని బతిమాలి పంపించారు.

**ఒక్కసీటు రూ.13 లక్షలు** కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ సీటు కావాలంటే రూ.13 లక్షలు డొనేషన్‌గా ఇవ్వాలంటూ కొన్ని ప్రైవేటు కళాశాలలు రేటు నిర్ణయిం చాయి. రంగారెడ్డి జిల్లాలోని ఐదు ప్రముఖ కళాశాలలైతే రూ.20 లక్షలు చెప్పి రూ.17 లక్షలు తీసుకుంటున్నాయి. ఇప్పటికే 90 శాతం సీట్లను డొనేషన్లు తీసుకుని కేటాయించాయి. సంప్రదాయ




ఇంజినీరింగ్ కోర్సులు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఆటోమొబైల్ విభాగాల్లో విద్యార్థులు చేరేందుకు ఇష్టపడడం లేదంటూ ఆయా కళాశాలల యాజ మాన్యాలు ఏఐసీటీఈ, రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించి ఆయా విభాగాల సీట్లను తగ్గించుకుని సీఎస్ఈలో అదనపు సీట్లకు అనుమతులు తెచ్చుకున్నాయి. కొన్ని కళాశాలలు ఏకంగా వంద సీట్లు అదనంగా తెచ్చుకున్నాయి. జేఎన్‌టీయూ అనుమతి ఇంకా లభించకపోవడంతో కౌన్సెలింగ్‌లో అదనపు సీట్ల వివరాలు వెబ్‌ఆప్షన్లలో కనిపించవు. దీంతో డొనేషన్లు చెల్లించిన విద్యార్థులు నేరుగా కళాశాలలకు వెళ్లి నిలదీస్తున్నారు.

# విద్యుత్తు భారం.. సౌర కాంతులతో దూరం

కొత్తగూడెం: బొగ్గు ఆధారిత విద్యుత్తు వినియోగాన్ని తగ్గిస్తూ.. సౌర విద్యుత్తును కాలక్రమేణా దేశమంతటా విస్తరించేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. తొలుత జిల్లాకొక గ్రామాన్ని ఎంపిక చేసి అక్కడి ప్రతి ఇల్లు, కార్యాలయం, వ్యవసాయ బోర్లు సహా అవసరమైన అన్ని వనరులకు సౌర విద్యుత్తు సదుపాయం కల్పించాలని రాష్ట్రాలకు సూచించింది. ఈ పథకం కింద ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఒక్కో గ్రామంలో పూర్తిస్థాయిలో సౌర విద్యుత్తు అందుబాటులోకి రానుంది. గ్రామ పంచాయతీలకు విద్యుత్తు బిల్లుల భారం తొలగిపోనుంది. వీధి దీపాలు, ప్రభుత్వ కార్యాలయాలు, మోటరు పంపుసెట్లు, ఇతరత్రా విద్యుత్తు వినియోగానికి ఏటా అధిక మొత్తంలో పంచాయతీ నిధుల నుంచి ఛార్జీలు చెల్లిస్తున్న విషయం విదితమే.

**డీఎల్‌సీకి ఎంపిక బాధ్యత**

గ్రామం ఎంపిక మొదలుకొని ప్లాంటు ఏర్పాటు, ఉత్పత్తి, వినియోగంపై పర్యవేక్షణకు జిల్లా స్థాయి కమిటీ(డీఎల్‌సీ)ని ప్రభుత్వం నియమించనుంది. ఎంపికైన గ్రామంలో ప్లాంటు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సాయం (గ్రాంటు)గా రూ.కోటి మంజూరు చేయనుంది. పెద్ద పరిశ్రమలు కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద ఖర్చుపెట్టే నిధులను సేకరించి ఈపథకం అమలుకు వినియోగించుకోవచ్చు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అమలుచేయాల్సి ఉంటుంది.

**పీఎం సూర్యఘర్‌కు స్పందన అంతంతే..**

దేశవ్యాప్తంగా కోటి ఇళ్లపై సౌర విద్యుత్తు ప్లాంట్లు నెలకొల్పాలనే



లక్ష్యంతో 'ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన'ను కేంద్రం అమలుచేస్తోంది. ఈపథకం కింద ఒక్కో యూనిట్‌కు రూ.78వేలు రాయితీగా అందిస్తోంది. అయినా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ప్రజల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉంది. ఇప్పటివరకు ఉభయ జిల్లాల్లో 500పైగా దరఖాస్తులు మాత్రవే వచ్చినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. వీరిలో కొందరు మాత్రమే సోలార్ యూనిట్లు అమర్చుకున్నారని తెలిపారు.

**ఇలా చేస్తే మేలు..**

ఒక ఇంట్లో మూడు కిలోవాట్ల విద్యుదుత్పత్తికి అవసరమైన సౌర ప్లాంటు ఏర్పాటుకు పీఎం సూర్యఘర్ యోజన కింద కేంద్రం రాయితీ ఇస్తుంది. మిగిలిన సొమ్మును విద్యుత్తు పంపిణీ సంస్థ(డిస్కం)లు పెట్టుబడిగా పెడితే ఉభయ జిల్లాల్లోని అన్ని గృహసముదాయాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయవచ్చు. గ్రామ అవసరాలకు ఎలాగూ కేంద్రం రూ.కోటి ఇస్తుండటంతో ప్రతి పల్లెలో సోలార్ విద్యుదుత్పత్తికి అవకాశముంటుంది. అంతేకాకుండా ప్రస్తుతం గృహజ్యోతి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి 200 యూనిట్ల వరకు డిస్కంలకు బిల్లులు చెల్లిస్తుంది. ఈ మొత్తాన్ని డిస్కంలు సౌర విద్యుత్తుపై పెట్టుబడి పెడితే గ్రామాలకు ఉచితంగా విద్యుత్తు సరఫరా అవుతుంది. డిస్కంలకు విద్యుత్తు కొనే భారం తగ్గుతుంది. గ్రామాల్లో ప్రజలు వాడుకోగా మిగిలిన విద్యుత్తును డిస్కంలు తక్కువ మొత్తానికే కొనొచ్చు. 'జిల్లాకొక గ్రామానికి పూర్తిస్థాయిలో సౌర విద్యుత్తు అందించాలనే పథకానికి సంబంధించి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. రాగానే తదుపరి చర్యలు చేపడతాం' అని ఉమ్మడి జిల్లా రెడ్కో మేనేజర్ జేఎస్ఎన్ మూర్తి'కు తెలిపారు.

## ధరణి కేంద్రంగా దందా..!

కోదాడ : కోదాడ తహసీల్ కార్యాలయంలోని ధరణి ఆపరేటర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతు పొలాన్ని రిజిస్ట్రేషన్ చేశాడు. రిజిస్ట్రేషన్ చేస్తే రూ.30 వేలు ఇవ్వాలని సదరు సిబ్బంది రైతును ఇబ్బందులకు గురి చేసిన ఆడియో వైరలైంది. దీనిపై కలెక్టర్ ధరణి ఆపరేటర్‌ను సర్వీసు నుంచి తొలగించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ధరణి ఆపరేటర్లను బదిలీ చేయడం గమనార్హం.

కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మరణించడంతో అతడి పేరు మీదున్న భూమిని ఫౌతి రిజిస్ట్రేషన్ చేయాలని కోదాడ తహసీల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. రూ.50 వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు ఆ రిజిస్ట్రేషన్ రద్దయ్యేలా చేసి రూ.లక్ష వరకు వసూలు చేశారని లబ్ధిదారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయించిన కలెక్టర్ ఆర్ఐను సస్పెండ్ చేసి తహసీల్దార్‌ను బదిలీ చేశారు.

భూ రిజిస్ట్రేషన్ల పేరిట దందా చేస్తున్నారని, ఈ అవినీతిని అరికట్టేందుకే వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేసి ధరణి పోర్టల్ అందుబాటులోకి తెస్తున్నామని, అవినీతికి ఆస్కారం లేకుండా భూ రిజిస్ట్రేషన్లు జరుగుతాయని గత ప్రభుత్వం తెలిపింది. కానీ అక్రమార్కులు తమ అవినీతి దందా మాత్రం మరువట్లేదు. ధరణిలోని సమస్యలను సాకుగా చూపించి లబ్ధిదారుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. ధరణి ఆపరేటర్ల కేంద్రంగా రెవెన్యూ అధికారుల దందా పెరిగిపోయింది. తాజాగా ఆ శాఖలో బదిలీలు, సస్పెండ్‌లు చేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకోవడమే ఇందుకు ఉదాహరణ.

**పర్యవేక్షణేది..?**

తహసీల్ కార్యాలయాల్లో విచ్చలవిడిగా వసూళ్ల పర్వం కొనసాగుతున్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. సామాన్య ప్రజలు రెవిన్యూ సిబ్బంది పెట్టే ఇబ్బందులు తాళలేక వారి డిమాండ్లకు తలొగ్గుతున్నారు. గతంలో ఫౌతి రిజిస్ట్రేషన్ల పేరిట భారీ స్థాయిలో ఆరోపణలు వచ్చినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ దందా ధరణి వచ్చినప్పటి నుంచి జరుగుతున్నా.. నేటికైనా అధికారులు చర్యలు తీసుకుంటుండటం సానుకూలాంశం.

**నేరుగా ఫిర్యాదు చేయండి-కలెక్టర్**

భూ సమస్యలపై తహసీల్ కార్యాలయానికి వచ్చే రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా రెవెన్యూ సిబ్బంది వారి సమస్యలను తీర్చాలి. ఉద్దేశపూర్వకంగా వారిని ఇబ్బందులు గురి చేసినా, వసూళ్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవు. రైతులకు ఇబ్బందులు తలెత్తితే నేరుగా మాకు ఫిర్యాదు చేయండి.

## ఆ తరం కష్టపడుతోంది..

మిర్యాలగూడ : తమ కుమారులు తనను పట్టించుకోవడం లేదని తిరుమలగిరి సాగర్ మండలానికి చెందిన ఓ వృద్ధుడు మిర్యాలగూడ ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయగా.. పరిశీలించిన ఆర్డీవో శ్రీనివాసరావు వృద్ధుడికి అనుకూలంగా తీర్పునిచ్చారు.

మిర్యాలగూడ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వృద్ధురాలు భర్త చనిపోయి అవస్థలు పడింది. తనకున్న ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు తనకు ఆసరాగా నిలిచేందుకు వయోవృద్ధుల చట్టం ప్రకారం న్యాయం చేయాలని చేసిన ఫిర్యాదుతో అధికారులు విచారణ చేపట్టారు. చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టాలు పడి.. తమ పిల్లల భవితను తీర్చిదిద్దిన తర్వాత పిల్లలు తమను పట్టించుకోకపోవడంతో వృద్ధులు అనేక అవస్థలు పడుతున్నారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పలు రకాల చర్యలు చేపడుతున్నప్పటికీ.. తమ ఇంటి నుంచే సహాయం కొరవడడంతో మానసికంగా కుంగి పోతున్నారు. వృద్ధుల సంక్షేమం కోసం 1991 నుంచి ఏటా ఆగస్టు 21న 'ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

పెరుగుతున్న ఫిర్యాదులు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల వయోవృద్ధుల సంక్షేమానికి ఆర్డీవో కార్యాలయాల్లో ఫిర్యాదుల సంఖ్య పెరుగుతోంది. మిర్యాలగూడ ఆర్డీవో కార్యాలయంలో ఈ ఏడాది ఇప్పటి వరకు 38 ఫిర్యాదులు రాగా.. 31 కేసుల్లో నోటీసులు జారీ చేశారు. 5 కేసుల్లో తీర్పులు ఇవ్వగా.. ఒక కేసును పోలీసులకు పంపించారు. ఇచ్చిన తీర్పును అమలు చేయని ఒక కేసును డీఎస్పీకి బదిలీ చేశారు. ఇదే విధంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ఆర్డీవో కార్యాలయాల్లో పదుల సంఖ్యలో ఫిర్యాదులు నమోదవుతున్నాయి.

దరఖాస్తు ఇలా చేయాలి..

వయో వృద్ధులను కుటుంబ సభ్యులు పట్టించుకోకుంటే వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం ప్రకారం తమకు న్యాయం జరిగేలా సంబంధిత ఆర్డీవో కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చు. తెల్ల కాగితంపై తమ సమస్యను వివరిస్తూ పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకుంటే.. అధికారులు విచారణ చేపడతారు. వృద్ధులతో పాటు వారి కుటుంబ సభ్యులను మూడు సార్లు విచారణ చేసిన తర్వాత వృద్ధులకు పోషణ, సంక్షేమ దక్కేలా తగిన తీర్పునిస్తారు.

ఏడాదికి 20 లోపే కేసులు-జి.శ్రీనివాసరావు, ఆర్డీవో, మిర్యాలగూడ

ఇటీవల వయోవృద్ధుల సంక్షేమ చట్టం ప్రకారం తమకు న్యాయం చేయాలంటూ వస్తున్న కేసుల సంఖ్య భారీగా పెరిగింది. గతంలో ఏడాదికి 20లోపే ఉండే కేసులు ప్రస్తుతం రెట్టింపయ్యాయి.

## హడలి పోయేలా..కూడలి..!

నకిరేకల్ : నకిరేకల్ ప్రధాన కూడలితో పాటు తిప్పర్తి రోడ్డు, మూసీరోడ్డుపై నిత్యం ట్రాఫిక్ సమస్యలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. పండుగల సమయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. కూడలిని తోపుడు బండ్లు, చిరువ్యాపారులు కమ్మేయడం, ఆటోలు, ఇతర వాహనదారులు ఇక్కడే పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారుతోంది. ఈ కూడలిని ఇటీవలే విశాలం చేసినా.. మళ్లీ ఆక్రమణలు మొదలు కావడంతో ఇరుకుగా మారుతోంది. వ్యాపారుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. జాతీయ రహదారి బైపాస్‌కు ఇరువైపులా సర్వీసు రోడ్లను పూర్తిచేయక పోవడంతో ప్రధాన కూడలిపై ట్రాఫిక్ ఒత్తిడి పెరుగుతోంది. ఎమ్మెల్యే దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు. రద్దీ వేళల్లో పోలీసులను ఏర్పాటు చేయాలని స్థానికులు ఇటీవల నల్గొండ డీఎస్పీ శివరాంరెడ్డికి ఫిర్యాదు చేశారు

# అవి'నీటి' బాగోతం



హైదరాబాద్: నగరంలో కొత్త నల్లా కనెక్షన్ల పేరుతో దందా నడుస్తోంది. తాజాగా మణికొండ డివిజన్‌లో జలమండలి మేనేజర్ స్ఫూర్తి రెడ్డి, ఒప్పంద ఉద్యోగి నవీన్‌గౌడ్ కొత్త నల్లా కోసం ఓ వ్యక్తి నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటంతో మరోసారి ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. శివార్లలో ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా కొనసాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 15ఎంఎం లైన్లకు రూ.30-40 వేలు వసూలు చేస్తుండగా...25ఎంఎం ఆపైన రూ.లక్షల్లోనే బేరసారాలు నడుస్తున్నాయని స్వయంగా కొందరు జలమండలి సిబ్బందే చెబుతున్నారు. ఈ దందాలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తున్నారు. కంప్యూటర్ సేవలే కాదు...స్థానిక మేనేజర్లు, డీజీఎంలకు దళారులుగా వ్యవహరిస్తూ ఈ వసూళ్ల కార్యక్రమానికి తెరతీస్తున్నారు.

**అక్రమాల తంతు ఇలా..**

ఆన్‌లైన్‌లో నల్లా కోసం దరఖాస్తు చేసిన తర్వాత గరిష్ఠంగా 15-20 రోజుల్లో నల్లా మంజూరు చేయాఉద్దేశ పూర్వకంగానే ఆలస్యం చేసి కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారు. 15ఎంఎం నుంచి 25ఎంఎం వరకు డీజీఎం స్థాయిలో నల్లా మంజూరు చేసే అవకాశం ఉంది. కొన్నిసార్లు అక్యుపెన్సీ ఇతర ధ్రువపత్రాలు లేకపోయినా సరే.. అడిగినంత ఇస్తే మంజూరు చేస్తున్నారు.

మణికొండ, ఉప్పాలగూడ, కోకాపేట తదితర ప్రాంతాల్లో భారీ ఎత్తున అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు వస్తున్నాయి. వీటికి నల్లా కనెక్షన్లు ఇచ్చే సమయంలో రూ.లక్షలు చేతులు మారుతున్నాయనేది బహిరంగ రహస్యం. ముఖ్యంగా బహుళ అంతస్తులు, వాణిజ్య భవనాలకు నల్లాలు మంజూరు చేసే ముందు ఫిజిబులిటీ పరిశీలించి...అభివృద్ధి ఛార్జీలు(ఇంప్రూవ్‌మెంట్ ఛార్జీలు) వేయాలి. ఈ కనెక్షన్లు ఇచ్చేప్పుడు ముందే మాట్లాడుకొని ఛార్జీలు అడ్డగోలుగా తగ్గిస్తున్నారు. : అక్రమ నల్లాల్లో కొందరు జలమండలి అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పాత్ర స్పష్టమవుతోంది. దళారులు అవతారమెత్తి అక్రమ నల్లాలను ప్రోత్సహిస్తున్నారు. గతంలో వాటర్‌బోర్డు తనిఖీల్లో భారీ ఎత్తున అక్రమ నల్లాలు పట్టుబడ్డాయి.

అనిశా వలలో జలమండలి మేనేజర్

**రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత**

రెండు నల్లా కనెన్షన్ల కోసం రూ.30 వేలు లంచం తీసుకుంటూ జలమండలి మేనేజర్ అనినీతి నిరోధక శాఖ అధికారుల వలలో చిక్కారు. మేనేజర్ తరఫున డబ్బులు తీసుకుంటూ పట్టుబడిన ఔట్ సోర్సింగ్ అధికారిని కూడా అరెస్టు చేసి ఏసీబీ అధికారులు న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. నెక్‌నామ్‌పూర్ శ్రీవెంకటేశ్వర కాలనీకి చెంది. బి.ఉపేంద్రనాథ్ కొత్తగా నిర్మించిన భవనానికి రెండు నల్లా కనెక్షన్ల కోసం మణికొండ మర్రిచెట్టు ప్రాంత కార్యాలయంలో దరఖాస్తు చేశారు. మేనేజర్ స్ఫూర్తిరెడ్డి రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో ఆయన ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యాలయంలో మేనేజర్ తరఫున ఔట్ సోర్సింగ్ అధికారి నవీన్‌గౌడ్ నగదు తీసుకున్నారు. అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు దాడి చేసి అతనిని పట్టుకున్నారు.

# వారు ఆక్రమిస్తారు.. వీరు అనుమతిస్తారు



హైదరాబాద్ : శంషాబాద్ ఔటర్‌పై చెన్నమ్మ హోటల్ వద్ద ప్రభుత్వ భూములను కొందరు పాట్లుగా చేసి ప్రహరీలు నిర్మించుకుని తాళాలు వేసుకున్నారు. వీరు ఆక్రమించుకున్న ఒక్కొక్క ప్రహరీలో ఎకరా నుంచి రెండెకరాల వరకు ఉంటుంది. శంషాబాద్ మండల రెవెన్యూ అధికారులు, మున్సిపాలిటీ అధికారులు కనీసం ఇటువైపు చూడడం లేదు.

కొత్వాల్‌గూడ గ్రామ పరిధిలో ఓ ప్రైవేటు వ్యక్తి నిర్మించిన ఫంక్షన్‌హాల్‌కు ఆయనే వేసుకున్న విశాలమైన రహదారి ఇది. ఫంక్షన్ హాల్ కూడా హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంది. దాని నిర్మాణానికి అనుమతి ఎవరు ఇచ్చారని మున్సిపల్ అధికారులు ప్రశ్నించలేదు. ఎలా నిర్మిస్తారంటూ జలమండలి అధికారులు గద్దించలేదు.

హైదరాబాద్ శివారులోని శంషాబాద్ విమానాశ్రయ పరిసర ప్రాంతాలు అనూహ్యంగా అభివృద్ధి చెందుతుండడంతో కొందరు ప్రైవేటు వ్యక్తులు శంషాబాద్ మున్సిపాలిటీ, హిమాయత్ సాగర్ చెరువులను లక్ష్యంగా చేసుకుని భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారు. చెరువును ఒకవైపు నుంచి క్రమంగా మట్టితో పూడ్చేస్తున్నారు. కొన్ని నెలల నుంచి నిర్మాణాలు, రహదారులు నిర్మిస్తున్నా జలమండలి అధికారులు, శంషాబాద్ మున్సిపల్, రెవెన్యూ అధికారులు కనీసం స్పందించడం లేదు. హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో ఫంక్షన్‌హాల్, సీసీ రోడ్లను నిర్మించిన ప్రైవేటు వ్యక్తులు బాహ్యవలయ రహదారి, విమానాశ్రయం కలిసొచ్చేలా చూసుకున్నారు.

**40 శాతం ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం**

శంషాబాద్ మండలంలోని కొత్వాల్‌గూడలోని సర్వేనంబర్ 54లో 200 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూములున్నాయి. వీటి సరిహద్దు నుంచి హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతం ప్రారంభమవుతుంది. మూణ్నాలుగు నెలల్లోనే కొందరు అక్రమార్కులు సుమారు 80 ఎకరాలకుపైగా భూములను ఆక్రమించారు. చదును చేసి ప్రహరీలు నిర్మిస్తున్నా అధికారులెవరూ అటు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**పరిశీలించకుండానే దస్త్రాలకు మోక్షం**


మహానగర పరిధిలో హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. చెరువులు, జంట జలాశయాలకు సంబంధించి పూర్తిస్థాయి నీటి నిల్వ(ఎఫ్‌టీఎల్) పరిధిలో నిర్మాణాలు, లేఅవుట్లకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) అనుమతులు ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. తాజాగా ఉస్మాన్‌సాగర్ పరిధిలో భారీ ఎత్తున అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చివేసింది. ఇందులో కొన్నింటికి హెచ్‌ఎండీఏ అనుమతులు సైతం ఉండటంతో అధికారులే అవాక్కవుతున్నారు. జలాశయాల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలా అనుమతులు ఇస్తారనేది ప్రశ్న. ఇరిగేషన్ శాఖ ఎన్‌వోసీ జారీ చేయడం వల్లే హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు వచ్చాయంటూ...ఇలా ఒకరిపై ఒకరు నెపం నెట్టుకొని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నారు. వాటికి సంబంధించి దస్త్రాలను పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నార్సింగి, శంషాబాద్, వట్టినాగులపల్లి, ఉప్పాలగూడ, గండిపేట, హిమాయత్‌సాగర్.. ఇలా అనేక ప్రాంతాల్లో అక్రమాలకు తెరతీశారు. చెరువులు, కుంటలు, జలాశయాలకు సమీపంలో నిర్మాణాలను చేపట్టేందుకు దరఖాస్తులు వస్తే.. క్షుణ్ణంగా పరిశీలించకుండా అనుమతులు జారీ చేశారు. ఇరిగేషన్ నుంచి ఎన్‌వోసీ వచ్చిందంటే చాలు...ఆ ఫైలును పరిశీలన లేకుండానే హెచ్‌ఎండీఏ ముందుకు కదిలించారన్న విమర్శలున్నాయి.

# నీటి దోపిడీ.. చెల్లదిక

హైదరాబాద్ : దేశంలోని వివిధ కంటోన్మెంట్ ప్రాంతాల్లో భూగర్భ జలాల వినియోగాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తాజాగా బోరుబావుల క్రమబద్ధీకరణకు సంబంధించిన గెజిట్‌ను విడుదల చేసింది. ఈ మేరకు అప్రమత్తమైన సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారులు ఇప్పటికే సర్వే పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. అయితే అభ్యంతరాలను తెలియజేసేందుకు ప్రజలకు అవకాశం కల్పిస్తూ కంటోన్మెంట్ బోర్డు ఫిబ్రవరి 23న డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మార్చి 5వ తేదీవరకు భూగర్భ జలాల వినియోగానికి సైతం డబ్బులు చెల్లించే విషయమై పెద్దఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ ప్రాంతంలోని నివాస గృహాలను మినహాయించాలని బోర్డు పాలక మండలితోపాటు సీఈవో మధుకర్ నాయక్ పట్టుబట్టారు. దీంతో దేశంలోని మిగతా కంటోన్మెంట్‌లలోని నివాసగృహాల్లో బోరుబావులను సైతం క్రమబద్ధీకరించనున్నప్పటికీ ఇక్కడ గృహ అవసరాలకు వినియోగించేవాటిని మినహాయించాలని కేంద్రం నిర్ణయించడం విశేషం. వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్‌లు, సొసైటీ తదితరాలలోని బోరుబావులకు రిజిస్ట్రేషన్ నంబర్లను కేటాయించేందుకు గెజిట్‌లో పేర్కొన్నట్లు 12 వివిధ అంశాలకు సంబంధించి అధికారులు సమగ్ర సర్వేను నిర్వహించనున్నారు.

**ఇంకుడు గుంత ఉందా.. లేదా**

కేంద్రం విడుదల చేసిన గెజిట్ ప్రకారం.. సర్వేలో భాగంగా బోరుబావులు ఒకే ప్రాంగణంలో ఎన్ని ఉన్నాయి. ఎన్ని అడుగులమేర తవ్వారు. బోరుబావులకు ఏ రకం పంపుసెట్లను వినియోగిస్తున్నారు, వాటి సామర్థ్యం ఎంత.. లాంటి 12 వివిధ అంశాలతో కూడిన దరఖాస్తు ఫారాలను రిజిస్ట్రేషన్ చేసుకునే బోరుబావులును వినియోగదారులకు ఇవ్వనున్నారు. వాటికి సంబంధించి సమగ్ర సర్వేను నిర్వహించనున్న అధికారులు



ఆయా ప్రాంగణాలలో ఇంకుడు గుంతలు ఉన్నాయా, లేవా.. అనే విషయాన్ని పరిశీలించనున్నట్లు తెలిసింది.

**వాణిజ్య అవసరాలకు వినియోగించే వాటిపై ప్రత్యేక దృష్టి**

బోర్డు పరిధిలో సుమారు 45 వేలకు పైగా బోరుబావులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అందులో నివాసగృహాలు, ఆర్మీ, పోలీసుల అవసరాలకు వినియోగిస్తున్న వాటిని మినహాయించగా, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నివాస ప్రాంతాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన బోరుబావుల నుంచి కొందరు వ్యాపారులు నీటిని తోడి వాషింగ్ సెంటర్లకు, మినరల్ వాటర్ ప్లాంట్లకు వాడుతున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. అలాంటి వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సమాచారం. ఇకపై కంటోన్మెంట్‌లో బావులను తవ్వాలంటే కేంద్రం జారీ చేసిన గెజిట్‌లో పేర్కొన్నట్లు పక్కాగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అనుమతులు తీసుకోకుండా తవ్వేతే భారీ జరిమానా విధించి, చట్టరీత్యా కఠిన చర్యలు చేపట్టే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

## ఇక్కడా ఉక్కుపాదం మోపాలి..!

మహబూబ్‌నగర్ : పెద్ద చెరువు రికార్డుల్లో మొత్తం 96.11 ఎకరాల్లో ఉంది. ప్రస్తుతం ఈ చెరువు 56 ఎకరాలకు కుచించుకుపోయింది. మిగతా 40 ఎకరాలు ఆక్రమణలకు గురైంది. ఈ ఆక్రమణలపై గతంలో పురపాలిక, సాగునీరు, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్త సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ఎఫ్‌టీఎల్ పరిధిలో మొత్తం 64 ఆక్రమణలున్నట్లు గుర్తించారు. గుర్తుగా మొత్తం 35 దిమ్మెలను భవనాల వద్ద ఏర్పాటు చేశారు. బఫర్ జోన్‌లోనూ మరో 70కు పైగా ఇళ్లు అక్రమంగా నిర్మించారు. రాజకీయ పలుకుబడితో ఈ ఆక్రమణలపై అధికారులు కన్నెత్తి చూడటం లేదు.

గ్రేటర్ హైదరాబాద్‌లో చెరువులు, కుంటల ఆక్రమణలపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా అక్రమాలపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ సంస్థ ఆధ్వర్యంలో చెరువులను ఆక్రమించి కట్టిన నిర్మాణాలను కూల్చేస్తున్నాయి. రాజకీయ ఒత్తిళ్లు, నేతల నుంచి పైరవీలు వస్తున్నా లొంగకుండా చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగిస్తోంది. హైడ్రా కేవలం అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) లోపలి వరకే పరిమితమైంది. ఉమ్మడి జిల్లాలో హైడ్రా లాంటి సంస్థను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలోని చెరువుల్లోనూ ఆక్రమణల భరతం పట్టొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయి. శిఖంలోనూ నిర్మాణాలు జరిగాయి. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిల్లోనూ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఇవన్నీ స్థానిక అధికారుల నోటీసులో ఉన్నా



రాజకీయ ఒత్తిళ్లతో కనీసం అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

**రాజకీయ పలుకుబడితో...**

పాలమూరులో 5,161 చెరువులు, 1,257 కుంటలున్నాయి. మొత్తం 6,418 చెరువులు నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో ఉన్నాయి. వీటిలో పలు చెరువులు, కుంటలు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం, జడ్చర్ల, దేవరకద్రల్లో చెరువులు, కుంటలు కుంచించుకుపోయాయి. నాగర్‌కర్నూల్ పట్టణంలో కేసరి సముద్రం చెరువు ఆక్రమణలకు గురయ్యింది. వీటి ఎఫ్‌టీఎల్ పరిధిలో పలు నిర్మాణాలు వెలిశాయి. జిల్లాలో నాగనూల్ చెరువుతోపాటు మరో మూడు కుంటలు కుంచించుకుపోయాయి. అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాల్లోనూ కొన్ని చెరువుల్లో ఆక్రమణలు జరిగాయి. వనపర్తి జిల్లాలో మర్రికుంట, తాళ్లచెరువు, నల్లచెరువులో ఆక్రమణలు భారీగా చోటు చేసుకున్నాయి. వీటి ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు వెలిశాయి. నారాయణపేట జిల్లాలోని మక్తల్, మరికల్ పట్టణాల్లో చెరువులో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇక్కడి చెరువుల్లో నిర్మాణాలు సైతం వెలిశాయి. జోగులాంబ గద్వాల జిల్లా సిద్దాంతికుంట, తిరుమలయ్య కుంట, జీవికుంట చెరువులు రూపురేఖలు మారాయి. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. నీటివనరుల ఆక్రమణలో రాజకీయ నేతల పాత్ర ఎక్కువగానే ఉంది. హైడ్రా లాంటి సంస్థను ఏర్పాటు చేసి ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తేనే వీటికి పూర్వవైభవం వచ్చే అవకాశం ఉంది. లేకుంటే ఈ ఆక్రమణలు రోజురోజుకు పెరిగే అవకాశాలున్నాయి.

## భారత్‌మాల వంతెన.. అవస్థలకు అంతుండేనా!

అయిజ : పాలకులు ప్రజలు, ముఖ్యంగా రైతుల ఇబ్బందిని గమనించి నిర్ణయాలు తీసుకోవాలి. భారత్‌మాల వంతెన నిర్మాణాల వల్ల రాబోవు రోజుల్లో రైతులు అవస్థలు పడాల్సి వస్తుందనేది స్పష్టంగా కనిపిస్తున్నా దానిపైన పాలకులు దృష్టి పెట్టడంలేదు. దీని వల్ల ఎదురయ్యే ఇబ్బందులు అన్నీఇన్నీ కావని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్రమైన సమస్య: కొన్ని ప్రదేశాలలో భారత్‌మాల రోడ్డు పనుల వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇప్పటికే రోడ్డుకిరువైపులా భూములు మిగిలిపోవడం రైతులకు శాపంగా మారుతోంది. దీనికితోడు కాలువలపైన భారత్‌మాల రోడ్డు కోసం చిన్నచిన్న వంతెనలు నిర్మిస్తున్నారు. దీన్ని కాలువ వరకే పరిమితం చేస్తున్నారు. కాలువ పక్కన రైతుల అవసరాల కోసం రోడ్డు ఉన్న విషయం భారత్‌మాల అధికారులు విస్మరించారు. ఈ తప్పిదం వల్ల రాబోవు రోజుల్లో ప్రజలు, ప్రధానంగా రైతులు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తుంది. పంట ఉత్పత్తులు మరోవైపునకు తరలించాలంటే 5 నుంచి 10 కిలోమీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తుంది. రెండు వందల అడుగుల వెడల్పు రోడ్డు దాటితే సరిపోయే పరిస్థితికి కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సి రావడమంటే అన్నదాతకు ఎంత శ్రమో అర్థం చేసుకోవచ్చు. కొన్ని ప్రదేశాలలో కాలువపైన వెడల్పుగా, రోడ్డుకు తక్కువ వెడల్పుగా వంతెనలు నిర్మిస్తున్నారు.

పై వంతెన నిర్మించాల్సి ఉనా..: భారత్‌మాల రోడ్డు పనులు ఆర్డీఎస్ ప్రధానకాల్వపైన తనగల, కొంకల మధ్య జరుగుతున్నాయి. దీని నిర్మాణం పైన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కాలువ కట్ట ఎత్తు ఎంత ఉంటే దానిపైన బ్రిడ్జి నిర్మించేస్తున్నారు. వాస్తవానికి కాలువ, దాని ఇరుపక్కలా కాలువ కట్టలకు కలిపి పై వంతెన నిర్మించాల్సి ఉంది. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నుంచి వచ్చే నీటిని నిల్వ చేసుకునేందుకు రిజర్వాయర్ల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. రిజర్వాయర్ల ఏర్పాటు తర్వాత కాలువ ఎత్తు పెంచాల్సి వస్తుంది. ఇటువంటి పరిస్థితులలో ప్రస్తుతం కాలువ కట్టస్థాయిలో బ్రిడ్జి నిర్మాణం ఇబ్బందికరంగా మారుతుంది. రాబోవు రోజుల్లో కాలువ ఎత్తు, వెడల్పు చేయాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. దీనికితోడు కాలువకు ఇరుపైపులా 20 అడుగుల వెడల్పుతో కట్టలున్నాయి. బ్రిడ్జిని కాలువ కట్టల ఎత్తులో మాత్రమే నిర్మిస్తున్నారు. ఆ కట్టలపై ఇక వాహనాలు వెళ్లే అవకాశం ఉండదు. ఒకవేళ వెళ్లాలంటే కాలువ కట్టలు 50 నుంచి 60 మీటర్ల మేర తొలగించాల్సి ఉంటుంది. అసలే అంతంత మాత్రంగా ఉన్న కాలువ కట్టలు ఈ రకంగా 50 మీటర్ల మేర తొలగిస్తే బలహీనపడతాయి. ఈ ప్రదేశంలో 50 మీటర్ల మేర కాంక్రీట్ వాల్స్ నిర్మించాల్సి ఉంది. కానీ 5 మీటర్ల మేర మాత్రమే కాంక్రీట్ పనులు చేశారు. ఇప్పటివరకు కాలువ కట్టలపైన రైతులు ధాన్యం, చెరకు, సుబాబుల్, మిరప, పత్తి వంటి పంటలను ట్రాక్టర్, లారీలలో తరలించేవారు. ఈ వంతెనలు పూర్తయితే అది సాధ్యం కాదు.

చర్యలు తీసుకుంటాం-విజయ్‌కుమార్‌రెడ్డి, ఈఈ, ఆర్డీఎస్

కాలువలపైన ఏర్పాటు చేస్తున్న బ్రిడ్జిల విషయంలో పరిశీలిస్తున్నాం. పూర్తిస్థాయిలో పనులు జరగాల్సి ఉంది. కాలువ కట్టలను కొంతమేర తొలగించాల్సి ఉంటుంది. వాటిపైన భారత్‌మాల అధికారులతో మాట్లాడుతున్నాం. రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటాం.

# అమ్మకు గుర్తుగా మొక్క..!

సూర్యాపేట : కనకనలాడే ఎండకు శిరస్సు మాడినా.. మనకు తన నీడను అందించే చెట్టే అమ్మాజారెడు నీళ్లయిన తాను దాచుకోక... జగతికి సర్వస్వం అర్పించే మబ్బె అమ్మ ఆ అమ్మలనే మించిన మా అమ్మకు... రుణం తీర్చుకోలేను ఏ జన్మకూ.. కంటేనే అమ్మ అంటే ఎలా... కరుణించే ప్రతి దేవత అమ్మే కదా... కన్న అమ్మే కదా..మాతృమూర్తులు తమ పిల్లలను ఎలా సంరక్షించుకుంటారో.. అలాగే ఒక చెట్టు కూడా పర్యావరణాన్ని అలా రక్షిస్తోంది.. ఇలా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమ తల్లుల పేరిట ఒక మొక్కను నాటాలని ఇటీవల మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ దేశ ప్రజలకు సూచించారు. తల్లులు చనిపోయిన వారు వారి ఫొటోలను తీసుకుని వెళ్లి మొక్కలు నాటాలని.. ఆ చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలని పేర్కొన్నారు. ప్రధాని పిలుపుతో ఆ దిశగా అధికార యంత్రాంగం అడుగులు వేస్తోంది. కాగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించి.. ఉద్యమంలా చేపడుతోంది.

అటవీ విస్తీర్ణం పెంపునకు దోహదం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అటవీ విస్తీర్ణం తీవ్రంగా వెనుకబడింది. ప్రస్తుత కాలంలో చెట్లను నరికివేస్తుండటంతో కాలుష్యం ప్రభావం పెరుగుతూ వస్తోంది. దీంతో వాతావరణంలో కాలుష్య సమతుల్యత తగ్గిపోతుంది. ఈ ప్రభావం భవిష్యత్తు తరాలపై తీవ్రంగా చూపే అవకాశం ఉండటంతో దీని నుంచి మేల్కొనేందుకు ప్రభుత్వాలు ఎన్నో చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా గత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని.. ప్రస్తుత ప్రభుత్వం పేరు మార్చి వన మహోత్సవం పేరిట చేపడుతోంది. గతంలో ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో, రహదారుల వెంట మొక్కలు నాటడంతో అటవీ విస్తీర్ణం కొంత వరకు పెరిగింది. ప్రస్తుతం వానాకాలం రావటంతో ఈ కార్యక్ర



మాన్ని ఉద్యమంలా చేపట్టాలని ప్రధాని మోదీ అధికారులకు, ప్రజలకు సూచించారు.

నాటిన మొక్కను సంరక్షిస్తేనే ప్రతిఫలం

సృష్టిలో తల్లులు తమ పిల్లలను ఎంత ప్రేమగా కాపాడుకుంటారో.. అదే రీతిలో నాటిన మొక్కనూ సంరక్షిస్తేనే అనుకున్న ప్రతిఫలం చేకూరుతుంది. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఇంటి ఆవరణలో ఒక మొక్కను నాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు అందాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 20 లక్షల మంది జనాభా ఉండగా..వీరందరు తల ఒక్కోటి నాటినా అన్ని లక్షల మొక్కలు నాటే వీలుంటుంది. వాటిని సంరక్షిస్తే ఉమ్మడి జిల్లాలో భవిష్యత్తు తరాలకు ఎంతో మేలు చేకూరుతుంది. అందరూ ఆలోచించి ఈ వన మహోత్సవంలో భాగస్వాములై, విజయవంతంగా చేపట్టాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఆ దిశగా నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తుండగా అవసరం ఉన్న మొక్కలను కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సూచించింది.

# కస్తూర్బాల్లో కష్టాలు..

నల్గొండ : చదువులు సాగిద్దామంటే సమస్యలు దండిగా ఉంటున్నాయి. పరిష్కరిద్దామంటే నిధుల కష్టం.. ఇవి కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయా(కేజీబీవీ)ల్లో ఎదురవుతున్న ఇబ్బందు లు. చదువు మధ్యలోనే మానేసి ఆర్థిక ఇబ్బందులతో ఇంటికి పరిమి తమయ్యే బాలికలకు విద్యనందించేందుకు ప్రభుత్వం కస్తూర్బాగాంధీ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ప్రతి పాఠశాలలో 200 మంది విద్యార్థినులు ఉండేలా వసతులతో భవనాలు నిర్మించింది. వసతితో పాటు భోజనం, ఇతర సౌకర్యాలు కల్పించింది. మొదట్లో ప్రారంభించిన పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించారు. అనంతరం ఏటా కొన్ని పాఠశాలలకు భవనాలు మంజూరు చేశారు.సమస్యలివిగో..ఉమ్మడి నల్గొండ జిల్లాలో 56 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలున్నాయి. చింతలపాలెం మినహా అన్నింటికీ సొంత



భవనా లు సమకూరుతున్నాయి. ఇప్పటికే కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తయి భవనాల్లోకి వెళ్లగా, మరికొన్ని సిద్ధంగా ఉన్నాయి. ఆరంభంలోనే సొంత భవనాలు నిర్మించిన చోట అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షాకాలం, శీతాకాలంలో బాలికలకు వేడి నీటి అవసరమని గుర్తించి సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేశారు. అవి ఏర్పాటు చేసిన ఆర్నెళ్లకే అవి మూలనపడ్డాయి. కోతులు సౌర పలకలను విరగకొట్టడంతో వైర్లు సైతం తెగిపోయి పనిచేయడం లేదు. తాగునీటికి ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసినా చాలా చోట్ల వివిధ కారణాలతో పనిచేయడం లేదు. దీంతో మంచినీటిని బయట కొనుగోలు చేస్తున్నారు. లోడు భారం పెరిగి నిత్యం మీటర్లు కాలిపోవడం, ప్రమాదాలకు దారి తీస్తున్నాయి.


పరిశీలించి చర్యలు తీసుకుంటాం

పూలన్, జీసీడీవో, సూర్యాపేట

కస్తూర్బా పాఠశాలల్లో చిన్నచిన్న సమస్యలను పరిష్కరించడానికి నిధులు జమ చేశాం. ఇతర పనులుంటే పరిశీలించి నిధులు సమకూర్చడంతో పాటు సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటాం.

గరిడేపల్లిలో ఊరి చివర శ్మశానం పక్కన చెరువు అంచున విద్యాలయం నిర్మించడంతో సరైన దారి లేదు. చుట్టూ కంపచెట్లు ఉన్నాయి. ఇంటర్ విద్యార్థులు సైతం ఇదే వసతి గృహంలో ఉండటంతో గదులు సరిపోక ఇరుకుతో ఇక్కట్లు పడుతున్నారు. కళాశాలలకు నూతన భవనాలు నిర్మించినా వినియోగంలోకి రాలేదు. తాగునీరు, విద్యుత్తు సౌకర్యం కల్పించలేదు. అందరూ ఒకే చోట ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలని, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# శిథిల ఇళ్లతో భయం



కరీంనగర్: నాగర్‌కర్నూల్ జిల్లా వనపట్లలో ఇంటి పైకప్పు కూలి తల్లి, ముగ్గురు పిల్లలు చనిపోవడం అందరినీ కలిచి వేసింది.. మరమ్మతుల విషయంలో అప్రమత్తంగా లేకపోవడంతో నాలుగు నిండు ప్రాణాలు పోయాయి.. ఈ ఘటన ఉమ్మడి జిల్లావాసులను కలవరపరిచింది. వానలు పడుతున్నాయంటే.. జనావాసాల మధ్య ఉన్న శిథిల భవనాలు ఆందోళన పెంచుతున్నాయి. కరీంనగర్, రామగుండం కార్పొరేషన్‌లతోపాటు 14 పురపాలికలు, 1,218 పంచాయతీల్లో వేలాది భవనాల గోడలు బీటలు వారి, పైకప్పు పెచ్చులూడి ప్రమాద ఘంటికల్ని మోగిస్తున్నాయి. జనాలకు ఆర్థిక ఇబ్బందులతో కొత్త ఇళ్లను నిర్మించుకునే పరిస్థితి లేకపోవడం.. మరమ్మతులు చేయించుకోకపోవడంతో ఆ భవనాల్లోనే బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని ప్రభుత్వ భవనాలు కూడా శిథిలావస్థలో ఉండి అందులో పని చేసే ఉద్యోగులను కలవర పెడుతున్నాయి. వర్షాకాలం ప్రారంభంలో శిథిల భవనాల గుర్తింపు ప్రక్రియ సాగుతున్నా అది మొక్కుబడిగానే అన్న అభిప్రాయం ఉంది. శిథిల భవనాల పక్కన ఉన్నవారు సమాచారమిస్తున్న సందర్భంలో మాత్రమే అధికారులు సంబంధిత ఇళ్ల యజమానులకు 'ప్రమాదకరంగా ఉన్నవి, కూల్చివేసుకోవాల'ని నోటీసులు ఇస్తున్నారు. గత వర్షాకాలం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50-60 ఇళ్లకు ఇలా నోటీసులివ్వగా యజమానులు కూల్చివేసుకున్నట్లు అధికారిక గణాంకాల్లో ఉంది. ప్రభుత్వ భవనాలు, వాణిజ్య సముదాయాలు, నివాసగృహాలు ఇలా అన్ని కలిపి అత్యంత ప్రమాదకరమున్నవి దాదాపుగా 2-3వేల వరకుంటాయని అంచనా. కానీ అధికారులు మాత్రం వారికున్న నిబంధనల ప్రకారం నిర్మాణం చేపట్టిన ఏడాది, గరిష్ఠంగా ఎంతకాలం మన్నుతుందనే అంచనాలతో వాటి శిథిలావస్థను గుర్తిస్తున్నారు.

గతేడాది వానాకాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉద్ధృతంగా కురిసిన వర్షాలు, పారిన వరదల కారణంగా పాత ఇళ్లు, పెంకుటిల్లు 458 కూలిపోయాయి. అందులో పైకప్పు, గోడలు, పాక్షికంగా కూలినవే ఎక్కువ. కూలిన సందర్భంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. కరీంనగర్ నగరపాలక సంస్థ నగరంలో 107 మంది యజమానులకు నోటీసులు అందించింది. వారి ఇళ్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని.. వాటిని ఎట్టి పరిస్థితుల్లో నేలమట్టం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందులో తక్షణం కూల్చాల్సిన వాటితోపాటు పాక్షికంగా మరమ్మతులు చేయాల్సిన వాటి వివరాల్ని కూడా సిబ్బంది తెలియజెప్పారు. కాగా ఇందులో 20 మంది వరకు ఇళ్లు కూల్చివేశారు. ఇంకో 19 ఇళ్లకు అవసరమైన మరమ్మతులు చేసుకున్నారు.

రామగుండం కార్పొరేషన్‌లో కేవలం 22 ఇళ్లకు నోటీసులివ్వగా అందులో మూడు ఇళ్లు మాత్రమే కూల్చివేశారు. మిగతా పురపాలికలన్నింటా కలిపి దాదాపుగా 250 వరకు గుర్తించి తాఖీదులివ్వగా అందులో పదిశాతం కూడా కూల్చివేసుకోలేదు.

పేదరికంతో ప్రత్యామ్నాయం లేక..

శిథిలావస్థ ఇళ్లలో ఎక్కువగా ఉండేది పేదలు, దిగువ మధ్య తరగతి వారే. ఇల్లు కూల్చివేసుకోవాలన్నా.. పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలన్నా ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి. దీంతో చాలామంది తాత్కాలిక మరమ్మతులతో సరిపుచ్చుకుంటూ అందులోనే నివసిస్తున్నారు.ఇళ్లు శిథిలావస్థ ఉంటే నోటీసులు ఇవ్వడం తప్పితే వాటి మరమ్మతులకు నిధులు మంజూరు చేసే అధికారం స్థానిక అధికారులకు లేదు. దీంతో వారు కూడా ఇళ్ల యజమానులపై ఒత్తిడి తేలేకపోతున్నారు.భారీ వర్షాలు పడినప్పుడు గ్రామాల్లో అధికారులు పునరావాస చర్యలు చేపట్టడంతో కొద్ది రోజులు అక్కడ ఉంటున్న పేదలు మళ్లీ వర్షాలు తగ్గాక తాత్కాలిక మరమ్మతులు చేసుకుని అందులోనే ఉంటున్నారు. సొంత ఇళ్లు లేనివారు, శిథిలావస్థ ఇళ్లలో ఉంటున్నవారు ప్రభుత్వానికి ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నా పూర్తిస్థాయిలో వారికి కేటాయిం చకపోవడంతో వారు ఉన్న ఇళ్లలోనే సర్దుకుపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రెండు పడక గదులకు శ్రీకారం చుట్టినా చాలా చోట్ల ఇంకా కేటాయించలేదు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమంలో ఇళ్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించగా లక్షల్లో దరఖాస్తులు వచ్చాయంటే జనం సొంతింటి కోసం ఎంతగా ఎదురు చూస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ః అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి పూర్తి శిథిలమైన ఇళ్లలో ఉంటున్న వారికి అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ నివాసం ఏర్పాటు చేసుకునేలా చూడటంతోపాటు వారు అర్హులైతే ప్రభుత్వం నుంచి ఇల్లు మంజూరు చేయించి ఇస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లవుతుంది. కరీంనగర్ కలెక్టరేట్‌లో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ ఉన్న దాదాపు 16 విభాగాల కార్యాలయాలన్నీ పాత కలెక్టరేట్ భవనంలో నడుస్తున్నాయి. పైకప్పు ఊడిపోయి, గోడలు బీటలు వారి ఎప్పుడు ఏది ఊడిపడుతుందో తెలియని పరిస్థితుల్లో ఇక్కడి సిబ్బంది బిక్కుబిక్కుమంటున్నారు. పైకప్పు ఉరుస్తుండటంతో కింద డబ్బాలు పెట్టి వాన నీళ్లను పడుతున్నారు. పైగా తడిసిన గోడలతో చాలా గదులు ఎప్పుడు కూలిపోతాయోననే భయం మాత్రం వీరిని వెంటాడుతోంది.

# అద్దె భవనంలో అవస్థల చదువులు




కోరుట్ల : కోరుట్ల పట్టణం ఏసుకోనిగుట్ట ప్రాంతంలో 2006 లో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా అప్పటి ప్రభుత్వం సుమారు 800 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి సొంతిళ్లులేని నిరుపేదలకు ఉచితంగా ఇళ్లను అందజేసింది. ఆ కాలనీల్లో సుమారు 2600 మంది ప్రజలు నివాసముంటున్నారు. మూడు వందల మంది వరకు చిన్నారులు, పాఠశాల విద్యార్థులున్నారు. నిరుపేదలకు ఉచితంగా విద్యనందించేందుకు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని యోచించారు. పాలకుల, ప్రజల అభ్యర్థన మేరకు విద్యాశాఖ 2016-17 విద్యా సంవత్సరంలో ఏసుకోనిగుట్ట ప్రాతంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంజూరు చేసింది. కౌన్సిలర్ పుప్పాల ఉమాదేవి స్థానికంగా రెండు ఇందిరమ్మ ఇళ్లను అద్దెకు తీసుకుని అందులో ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయించారు.ఒకటి నుంచి అయిదు వరకు ఒకే ఉపాధ్యాయుడు అప్పటి నుంచి ప్రస్తుత విద్యా సంవత్సరం వరకు అద్దె భవనంలోనే ప్రభుత్వ పాఠశాలను నిర్వహిస్తున్నారు. మొదట్లో విద్యార్థులు సుమారు 100 వరకు చదువుకునే వారు. ఏళు గడుస్తున్నా మౌళిక వసతులు కల్పించక పోవడం, ఉపాధ్యాయులను నియమించకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. పాఠశాలలో ప్రస్తుతం 35 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల మంజూరై ఏడేళ్లు గడుస్తున్నా ఇప్పటివ రకు విద్యాశాఖ శాశ్వత ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదు. ఏటా పట్టణంలోని ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులలోంచి ఒకరిని ఇక్కడికి డిప్యూటేషన్‌పై నియమిస్తున్నారు. దీంతో ఒకే ఉపాధ్యాయుడు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు బోధించాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుడు సెలవుపై, పాఠశాల పనిమీద వెళ్తే మధ్యాహ్న భోజనం నిర్వాహకులే పాఠశాలను నడిపించాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలల్లో రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. అందులోనే ఓవైపు విద్యార్థులకు చదువులు చెప్పడం, మరోవైపు మధ్యాహ్నం వంట చేస్తున్నారు. మరో గదిలో వివిధ తరగతుల విద్యార్థులు కూర్చోగా, బియ్యం సంచులు, ఇతర సామగ్రి ఉంచుతున్నారు. ఏడేళ్లుగా పాఠశాల భవనానికి నెలకు రూ.2 వేల చొప్పున అద్దెను చెల్లిస్తున్నారు. పాఠశాలకు శాశ్వత భవనాన్ని నిర్మించాలని ఎమ్మెల్యే, విద్యాశాఖ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకె ళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఏసుకోని గుట్ట ప్రాంతంలో పాఠశాలకు శాశ్వత భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వ స్థలం ఉంది. భవనాన్ని నిర్మించి, ఉపాధ్యాయులను నియమిస్తే 100 మందికిపైగా విద్యార్థులను పాఠశాలలో ఉన్నామని కాలనీవాసులు చెబుతున్నారు.

# హాస్టల్ విద్యార్థులకు దోమ కాటు!

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని పలు కళాశాలలకు చెందిన హాస్టళ్లు, ప్రైవేటు వసతిగృహాల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఉన్నత విద్యాభ్యాసానికి కళాశాల హాస్టల్‌లో, పోటీ పరీక్షల నిమిత్తం ప్రైవేటు హాస్టళ్లలో ఉంటున్న అభ్యర్థులు దోమ కాటుకు గురవుతున్నారు. పారిశుద్ధ్యం సరిగా లేకపోవడం, తగినన్ని ఫ్యాన్లు, దోమ తెరల లాంటి వసతులు లేకపోవడంతో జ్వరాల బారినపడుతున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. నల్లకుంట ప్రభుత్వ ఫీవర్ ఆసుపత్రి, ఉస్మానియా, గాంధీ, ప్రైవేటు ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరుగుతోంది. ఉస్మానియా, గాంధీలో నిత్యం ఓపీకి 1500-2000 మంది వస్తున్నారు. మూడేళ్లుగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, అతిసారం, డయేరియా కేసులు పెరుగుతున్నాయి.అప్రమత్తతతో..దోమల కారణంగా మలేరియా, డెంగీ, గన్యా వ్యాధులు పెరుగుతుంటాయి. ఈ వ్యాధుల బారిన పడకుండా దోమల నియంత్రణకు పరిసరాల పరిశుభ్రత పాటించాలి. ఇంట్లో దుమ్ము ధూళి, పాత సామగ్రిని శుభ్రం చేయాలి. ఇంటి చుట్టూ, పూల కుండీలు, కూలర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఎక్కడపడితే అక్కడ నీరు తాగడం మంచిది కాదు.

# సేంద్రియ సాగులో మేటి

మిర్యాలగూడ : ఉన్నత చదువు చదివి.. రూ.వేలల్లో వేతనానికి ఏసీ గదుల్లో పని చేసే ఉద్యోగావకాశాలు ఉన్నా.. అవన్నీ వదిలేసి వ్యవసాయంపై మక్కువ.. భూమిపై ప్రేమతో సాగు రంగంలోకి అడుగు పెట్టారు మిర్యాలగూడ పట్టణానికి చెందిన సోమా పవన్‌కుమార్. కెమికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఈయన చదువు పూర్తయిన వెంటనే 2004లో వ్యవసాయాన్ని ప్రారంభించారు. పెద్దవూర మండలం పెద్దగూడెంలోని తమకున్న వ్యవసాయ క్షేత్రంలో పలు రకాల పంటలు పండిస్తున్నాడు. వరితో పాటు బత్తాయి, బొప్పాయి, అల్లం, పుచ్చకాయ, కూరగాయలతో పాటు చేపలు, కోళ్ల పెంపకం చేపడుతున్నారు.

పదిహేనేళ్లుగా..2009లో ఎనిమిది గుంటల విస్తీర్ణంలో సేంద్రియ పద్ధతిలో వరి సాగు ప్రారంభించిన పవన్‌కుమార్.. ఏటా కొంత విస్తీర్ణం పెంచుతూ ప్రస్తుతం నాలుగున్నర ఎకరాల్లో పండిస్తున్నారు. పొలానికి పురుగు మందులకు బదులు వర్మీ కంపోస్టుతో పాటు ఆవు మూత్రం, వేపనూనె, పుల్లటి మజ్జిగ, పురుగులు రాకుండా జిగురు అట్టలు, సోలార్ ట్రాప్‌లు వాడుతున్నారు.

తొలుత దిగుబడి తక్కువగా వచ్చినా ప్రస్తుతం బాగానే వస్తోందని.. ఈ బియ్యం తిన్న వారు మళ్లీ కావాలంటున్నారని పవన్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతులకు వర్మీ కంపోస్టు తయారీలో



ఉచిత శిక్షణ అందిస్తూ.. లాభాలను వివరిస్తున్నారు.

సంఘటితంగా ముందుకు..పెద్దవూర రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన పవన్‌కుమార్ ప్రస్తుతం దానికి డైరెక్టర్‌గా ఉన్నారు. నాబార్డు సహకారంతో ఏర్పాటైన ఈ సంఘంలో ఐదు మండలాలు.. 35 గ్రామాలకు చెందిన 500 మంది వరకు రైతులు సభ్యులుగా ఉన్నారు. సంఘం ఆధ్వర్యంలో వర్మీ కంపోస్టు విక్రయం, రసాయన ఎరువుల దుకాణం, వివిధ బ్యాంకుల నుంచి రుణ సదుపాయం, వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా పరిశ్రమలకే విక్రయం వంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

సోమా పవన్‌కుమార్, యువ రైతు, మిర్యాలగూడ

రసాయన ఎరువుల వాడకంతో పర్యావరణ కాలుష్యంతో పాటు భూసారం తగ్గుతోంది. అందుకే నా వంతుగా సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తూనే రైతులకూ అవగాహన కల్పిస్తున్నా. ప్రభుత్వాలు వర్మీ కంపోస్టు ఎరువులను ఉచితంగా అందించి ప్రోత్సహించాలి.

# పర్యావరణ సంచులతో ఆరోగ్యం పదిలం

మధిర : "ప్రపంచ వ్యాప్తంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచులు తగ్గించాలనే లక్ష్యంతో బ్యాగ్ ఫ్రీ వరల్డ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 2010 జులై 3 నుంచి అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచి రహిత దినం నిర్వహిస్తున్నారు."మానవ మనుగడకు ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరంగా పరిణమించింది. అందులో పాలిథిన్ సంచులు సింహభాగం ఆక్రమించాయి. ఒకసారి వాడి పడేసిన ప్లాస్టిక్ సంచులు పర్యావరణానికి పెను విఘాతం కలిగిస్తుండగా పశుపక్ష్యాదులకు ప్రాణసంకటమవుతున్నాయి. నిషేధిత పాలిథిన్ సంచులను వాడొద్దని పర్యావరణవేత్తలు, సామాజిక ఉద్యమకారులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు వ్యక్తులు, సంస్థలు ఇందులో భాగస్వాములవుతున్నారు. నేడు ప్రపంచ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం సందర్భంగా కథనం..

మధిరలో సమాజ హితులు

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం మధిరలో సామాజిక సేవకుడు లంకా కొండయ్యతోపాటు పలువురు పర్యావరణ హితులు తమ వంతు బాధ్యతగా స్ఫూర్తి నింపుతున్నారు. ప్రతిరోజు ఉదయపు నడకలోనూ కన్పించిన ప్లాస్టిక్ వస్తువులు, సంచులను ఏరి వాటిని ధ్వంసం చేస్తున్నారు. దశాబ్దన్నర కాలంగా ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మధిరకు చెందిన పలువురు శుభకార్యాలు, దేవాలయాల వద్ద జరిగే వేడుకల్లో భక్తులకు, మహాశివరాత్రి జాతర సమయంలో వచ్చిన వారికి ఇలా ఇప్పటికి వేలాదిగా ప్లాస్టిక్ రహిత సంచులను ఉచితంగా అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

మూగజీవాలకు ప్రాణాంతకం

నిత్యం వినియోగించే ప్లాస్టిక్ సంచులను రహదారి పక్కన పడేయడంతో వాటిని పశువులు తింటూ అనారోగ్యం బారిన పడుతున్నాయి. ఒక్కోసారి మృత్యువాత పడుతున్నాయి. జిల్లాలో గతంలో జరిగిన పలు సంఘటనలు ఇందుకు నిదర్శనాలవుతున్నాయి. ప్లాస్టిక్ సంచులను మురుగు కాలువల్లో పడేస్తుండటంతో పేరుకుపోయి మురుగు ప్రవహించకుండా పారిశుద్ధ్య సమస్య నెలకొంటోంది. వాటిలో ఆహార పదార్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ప్రపంచంలో సగటున 12 నిమిషాలు వినియోగించే ఒక ప్లాస్టిక్ సంచి వెయ్యి సంవత్సరాల వరకు కాలుష్యకారకమవుతుందని ఓ సంస్థ పరిశోధనలో చెప్పింది.పాత దుస్తులతో సంచులు కుట్టి అందజేస్తున్నా

– కోమటి లత, ఆజాద్‌రోడ్డు

పాత దుస్తులతో సంచులు తయారీ చేస్తుంటా. సామాజిక సేవకుడు లంకా కొండయ్య సేకరించిన పాత దుస్తులను అందిస్తుంటే వాటితో ఇలా సంచులు తయారీ చేసి ఇస్తుంటా. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం నా వంతుగా కృషి చేస్తున్నా. దర్జీగా జీవనం సాగిస్తూనే మరో వైపు సమాజ హితం కోసం ఇలా సంచులు కుట్టి ఉచితంగా అందజేస్తున్నా.

తయారీనే నిషేధించాలి

–పుల్లఖండం చంద్రశేఖర్, మధిర

పర్యావరణ పరిరక్షణ కోసం పెద్దఎత్తున ఉద్యమమే జరగాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా ప్లాస్టిక్ కవర్ల తయారీ కంపెనీలను నిషేధిస్తేనే వినియోగం నూరు శాతం తగ్గుతుంది. ప్రభుత్వాలు ఈ దిశగా దృష్టి సారించాలి. నా వంతుగా పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ రహిత సంచులను బస్టాండ్, రైల్వేస్టేషన్లతోపాటు వన సమారాధన వేదికల్లో పంపిణీ చేస్తున్నా. ప్లాస్టిక్‌తో అనర్థాలు, వస్త్ర, జనపనార సంచులతో ప్రయోజనాలపై కరపత్రాలను రూపొందించి అందజేస్తున్నా.



# నదిలోకి దూసుకెళ్లిన భారత ప్రయాణికుల బస్సు

కాఠ్మాండూ: నేపాల్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భారత పర్యటకులు ప్రయాణిస్తున్న ఓ బస్సు నదిలోకి దూసుకెళ్లింది. తనాహున్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులున్నారు. వీరంతా భారతీయులే. వీరిలో 14 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర నంబరు ప్లేటుతో ఉన్న ఓ ట్రావెల్స్ బస్సు శుక్రవారం ఉదయం నేపాల్‌లోని పోఖారా నుంచి కాఠ్మాండూ వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. కొండల ప్రాంతంలో అదుపు తప్పి మర్స్యాంగ్డి నదిలో పడిపోయింది. ఈ సమాచారమందుకున్న ఆర్మీ, రెస్క్యూ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రయాణికుల్లో ఇప్పటివరకు 16 మందిని కాపాడగా.. మరో 14 మంది మృతదేహాలను గుర్తించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. గల్లంతైన వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ రిలీఫ్ కమిషనర్ స్పందించారు. స్థానిక అధికారులతో మాట్లాడి సమాచారం తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ఏడాది జులైలోనూ నేపాల్‌లో ఇలాంటి దుర్ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో రెండు బస్సులు నదిలో పడిపోయాయి. ఈ ఘటనలో ఏడుగురు భారతీయులు సహా 60 మందికి పైగా ప్రయాణికులు గల్లంతయ్యారు.



# ఇస్రో లాభాల పంట
## రూపాయికి రెండున్నర రెట్ల లాభం

భారత అంతరిక్ష సంస్థ ఇస్రోపై వెచ్చించే ప్రతీ రూపాయికి భారీగా లాభం వస్తోంది. ఈ విషయాన్ని ఆ సంస్థ ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ ఓ ఆంగ్లవార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఇస్రోపై రూపాయి పెట్టుబడి పెడితే అది రూ.2.54గా తిరిగి వస్తోందని సోమనాథ్ పేర్కొన్నారు. ఇది ఆర్థికంగా సమాజానికి కూడా లాభమని ఆయన అభివర్ణించారు. ఇటీవల ఫ్రాన్స్‌కు చెందిన నోవాస్పేస్ సంస్థ ఇటీవల భారతలో ఇస్రో ఆర్థిక, సామాజిక ప్రభావం అనే అంశంపై రిపోర్టును ప్రచురించింది. ఈ పరిశోధనను ఇస్రోనే చేయించి ప్రభుత్వానికి సమర్పించింది. దీనిని నేషనల్ స్పేస్ డే సందర్భంగా విడుదల చేశారు. దీని అంచనా ప్రకారం గత దశాబ్దంలో భారత అంతరిక్ష సంస్థ 60 బిలియన్ ఆర్థిక ప్రయోజనాలు, 47లక్షల ఉద్యోగాలను సృష్టించినట్లు పేర్కొంది. దీంతోపాటు 24 బిలియన్ డాలర్ల విలువైన పన్ను ఆదాయం తీసుకొచ్చినట్లు పేర్కొంది. ఈ రిపోర్టులో దేశంలోని మారుమూల ప్రాంతాలు, అసంఘటిత రంగాల్లో ఇస్రో ప్రభావాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేయలేదు. రానున్న పదేళ్లలో పరిస్థితులను బట్టి ఈ సంస్థ భారత ఆర్థిక వ్యవస్థకు 89 బిలియన్ డాలర్ల నుంచి 131 బిలియన్ డాలర్ల వరకు సమకూర్చవచ్చని అంచనా వేసింది. భారతీయుల రోజువారీ జీవితాల్లో ఉపగ్రహ ఆధారిత అప్‌డేట్లు కూడా కీలక భాగమయ్యాయని ఈ నివేదిక పేర్కొంది. నోవాస్పేస్ ప్రధాన సలహాదారు స్టీవ్ బౌచర్ మాట్లాడుతూ.. గత 55 ఏళ్లలో ఇస్రోపై ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం సొమ్ము.. అమెరికాకు చెందిన నాసా ఏడాది బడ్జెట్ కంటే తక్కువేనని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇస్రో వార్షిక బడ్జెట్ 1.6 బిలియన్ డాలర్లు. నాసా బడ్జెట్ 25 బిలియన్ డాలర్లు. అంటే దాదాపు 15.5 రెట్లు అధికం. 2023 డిసెంబర్ 31 నాటికి ఇస్రో 127 భారతీయ ఉపగ్రహాలను ప్రయోగించింది. వీటిల్లో ప్రైవేటువి, విద్యాసంస్థలవి కూడా ఉన్నాయి. మూడు డీప్ స్పేస్ మిషన్లకు కూడా ఇస్రో వేదికైంది. వీటిల్లో 50 ఉపగ్రహాల విలువ రూ.50,000 కోట్లు పైమాటే. ఇవి వాతావరణం, తుఫాన్లపై నిఘా, ఏటీఎంలు, పంటల దిగుబడి అంచనాలు, స్మార్ట్ సిటీ ప్లానింగ్ వంటి రంగాల్లో పని చేశాయి. రోజువారీ 8 లక్ష మంది మత్స్యకారులకు ఉపగ్రహ సమాచారం ఉపయోగపడుతోంది. ఇక మొత్తం 97 రాకెట్ల సాయంతో 432 విదేశీ ఉపగ్రహాలను కూడా కక్ష్యలోకి చేర్చింది.

# పరవాడ ఫార్మా సెజ్‌లో ఘటన దురదృష్టకరం





అనకాపల్లి జిల్లా, ఆగస్టు 23: పరవాడ సినర్జిన్ ఫార్మాలో జరిగిన ఘటన దురదృష్టకరమని .. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను విశాఖపట్నం ఇండస్ హాస్పిటల్ లో ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పరామర్శించారు. అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు గంట గంటకు ఈ ఘటనపై మానిటరింగ్ చేస్తున్నారన్నారు. రాత్రి 12 గంటల 30 నిమిషాలకు జరిగిందని తెలిపారు. గాయపడిన వారిని యాజమాన్యం సిబ్బంది ఆసుపత్రికి తీసుకెళ్లారన్నారు. హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించినట్లు తెలిపారు. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారని.. వారిలో ముగ్గురు జార?ండ్ రాష్ట్రానికి, ఒకరు విజయనగరానికి చెందినవారు ఉన్నారన్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్, ముంబైకి కూడా తరలించడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. ఈ ప్రమాదానికి ప్రధాన కారణం మానవ తప్పిదమే అని తెలుస్తోందన్నారు. కొన్ని రోజులు తాత్కాలిక ప్లాంట్ ఆఫ్ చేసి భద్రత ప్రమాణాలు పెంచాలని ఫార్మా కంపెనీలు కోరుతున్నారన్నారు. వరుసగా జరుగుతున్న ప్రమాద ఘటనలను మాజీ ముఖ్యమంత్రి జగన్‌తో సహా వైసీపీ నేతలు రాజకీయం చేస్తున్నారని ఎంపీ సీఎం రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ఫార్మా కంపెనీలో ప్రమాదం జరిగి 24 గంటలు గడవకముందే మరో ఫార్మా కంపెనీలో ప్రమాదం చోటు చేసుకోవడంతో అనకాపల్లి వాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో జవహర్ లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో ఉన్న సినర్జిన్ యాక్టివ్ ఇన్ గ్రేడియంట్స్ సంస్థలో ప్రమాదం జరిగింది. నలుగురు కార్మికులకు గాయాలయ్యాయి. ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పరవాడ ఫార్మా సెజ్‌ల జరిగిన ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించారు. జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుకున్నారు. బాధితులకు అందుతున్న వైద్యంపై సైతం చంద్రబాబు ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించేందకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను చంద్రబాబు ఆదేశించారు. హోంమంత్రి, ఇతర ఉన్నతాధికారులను వెంటనే బాధితుల వద్దకు వెళ్లాలని ఆదేశించారు. అటు.. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమలో బుధవారం జరిగిన ప్రమాదంలో 17 మంది మృత్యువాత పడగా.. అనేక మంది తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. వీరిలో నెల క్రితం ఉద్యోగాల్లో జాయిన్ అయిన వారు సైతం ఉన్నారు.

# అద్భుతాలు చేయడానికి చేతిలో మంత్రదండం లేదు



అమరావతి: వైసీపీ హయాంలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 75 శాతం గ్రామాల్లో వైసీపీకి చెందిన సర్పంచ్‌లే ఉన్నారన్నారు. రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు.. ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధి కోసమే కృషి చేయాలని పవన్ పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగానే అభివృద్ధే కూటమి లక్ష్యమన్నారు. దేశభక్తి పంచాయతీల నుంచే రావాలన్నారు. గ్రామస్థాయి నుంచి వచ్చిన నాయకులే జాతీయ స్థాయికి వెళ్లారన్నారు. పంచాయతీ వ్యవస్థ దేశానికి వెన్నెముక అని పవన్ పేర్కొన్నారు. గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుందని తెలిపారు. పదవులు తనకు అలంకరణ కాదని.. బాధ్యత అని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. చంద్రబాబు అపార అనుభవం ఏపీకి అవసరమని పేర్కొన్నారు. ఏపీని అప్పుల బారి నుంచి తప్పించి.. సంపద సృష్టించేందుకు చంద్రబాబు అనుభవం అవసరమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. చంద్రబాబు నుంచి నేర్చుకోవడానికి తాను ఎప్పుడూ సిద్ధమన్నారు. ప్రభుత్వ భూముల రక్షణకు సరికొత్త చట్టం తెస్తామన్నారు. ఐదేళ్లలో 20 గ్రామసభలు జరిగేలా చూస్తామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రతి పంచాయతీకి సొంత భూమి ఉండాలన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అవసరమైతే గూండా యాక్టు కూడా తెస్తామన్నారు. గ్రామాల్లో కళాశాలలు, క్రీడా మైదానాలు లేని దుస్థితి నెలకొందని వాపోయారు. ప్రభుత్వ భూములు ఉంటే నిర్మాణాలు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ పరంగా పంచాయతీకి ఆస్తులు లేకపోతే వ్యర్థమేనన్నారు. దాతలు ముందుకొస్తే తాను కూడా నిధులు తీసుకొచ్చి.. క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తానని పవన్ కల్యాణ్ వెల్లడించారు. బాధ్యతల నుంచి తాము పారిపోబోమని.. నిరంతరం పని చేస్తామని పవన్ తెలిపారు. అద్భుతాలు చేయడానికి చేతిలో మంత్రదండం లేదని.. గుండెల నిండా నిబద్ధత ఉందన్నారు. చంద్రబాబు అనుభవం ఏపీకి అవసరమని తాను చాలా సభల్లో చెప్పానన్నారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించగలిగేది ఒక్క చంద్రబాబేనన్నారు. లక్షల మందికి ఒకటో తేదీనే పెన్షన్లు ఇవ్వగలిగారని చంద్రబాబును పవన్ ప్రశంసించారు. తన కంటే బాగా ఆలోచించగలిగేవాళ్ల వెంట నడిచేందుకు తానెప్పుడూ సంకోచించబోనన్నారు. పరిపాలన అనుభవం ఉన్న చంద్రబాబు నుంచి ఎంతో నేర్చుకోవాలనే తపన తనకు ఉందన్నారు. ప్రజల కోసం కూలీ మాదిరిగా పనిచేసేందుకు తాను సిద్ధమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించడం తమ్మినేనికి అలవాటే.. కూన రవికుమార్ సంచలన ఆరోపణలు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ మాజీ అసెంబ్లీ స్పీకర్ వైసీపీ నేత తమ్మినేని సీతారాంపై తెలుగుదేశం పార్టీ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫేక్ డిగ్రీ సర్టిఫికెట్లే కాదు.. ఆస్తులకూ ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించడం తమ్మినేనికి అలవాటేనని ఆరోపణలు చేశారు. తమ్మినేని అక్రమాలపై దర్యాప్తు కోసం స్పెషల్ టీం వేయాలని సీఎంను కోరతానని అన్నారు. సీతారాంకు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించడం అలవాటేనని ఆరోపించారు. ఆ అలవాటులో భాగంగానే తమ్మినేని ఫేక్ డిగ్రీ సర్టిఫికెట్ తెచ్చుకున్నారని ఆరోపించారు. తమ్మినేని సీతారాం ఇతర ఆస్తుల పైనా ఫేక్ డాక్యుమెంట్లు తయారు చేశారని విమర్శలు చేశారు. సుమారు 17 ఆస్తులపై దమ్మాబుస్సుల సీతారాంఫేక్ డాక్యుమెంట్లు సృష్టించారని ఎద్దేవా చేశారు. శ్రీకాకుళంలోనూ వివిధ కోర్టుల్లోనూ సీతారాంపై ఫేక్ డాక్యుమెంట్ల కేసులు నడుస్తున్నాయని ఆరోపించారు. ఇసుక తవ్వకాల్లోనూ ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడ్డారని విమర్శలు చేశారు. నకిలీ మిషన్ల ద్వారా తమ్మినేని ఫేక్ ఓచర్లు పుట్టించారని, నకిలీ మిషన్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని ఆరోపించారు. ఇసుక అక్రమాలపై ఇప్పటికే ఫిర్యాదు చేశానని అన్నారు. దమ్మాబుస్సుల సీతారాంపై నేరాలు -ఘోరాలు అనే ఎపిసోడ్ తీయొచ్చని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో సీతారాం ఫేక్ రెవెన్యూ డాక్యుమెంట్లపై ఫిర్యాదులు వస్తే వాటి మీద చర్యలు తీసుకుంటామని కూన రవి కుమార్ స్పష్టం చేశారు. తమ్మినేని సీతారాం అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ్మినేని సీతారాం ఫేక్ డిగ్రీ సర్టిఫికెట్ తెచ్చుకున్నారని ఆరోపణలు చేశారు. జగన్ ప్రభుత్వంలోనే నాటి స్పీకర్ తమ్మినేని ఫేక్ డిగ్రీ సర్టిఫికెట్ ద్వారా లా అడ్మిషన్ తీసుకున్నారని విమర్శలు చేశారు. నాటి సీఎం జగన్ దీన్ని పట్టించుకోలేదని చెప్పారు. డిగ్రీ చేసినట్టు అంబేద్కర్ యూనివర్శిటీ పేరుతో ఫేక్ సర్టిఫికెట్ తెచ్చారని విమర్శించారు. ఉస్మానియా యూనివర్శిటీ పరిధిలోని ఓలా కాలేజీ నుంచి అడ్మిషన్ తీసుకున్నారన్నారు. తమ్మినేని ఫేక్ వ్యవహారాన్ని అంబేద్కర్, ఉస్మానియా యూనివర్శిటీలు రెండూ ధ్రువీకరించాయని అన్నారు. తమ్మినేని ఫేక్ వ్యవహారంపై రాష్ట్రపతికి కూడా ఫిర్యాదు చేశానని తెలిపారు. తమ్మినేని మీద సీఎస్ కు ఫిర్యాదు చేయాలని రాష్ట్రపతి కార్యాలయం నుంచి తనకు సమాచారం అందిందని అన్నారు. ఈ మేరకు సీఐడీతో విచారణ చేయించాలని సీఎస్‌కు ఫిర్యాదు చేశానని అన్నారు. తమ్మినేని ఫేక్ వ్యవహారం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అంశం.. అందుకే సీఐడీతో విచారణ జరిపించాల్సి ఉంటుందని అన్నారు. త్వరలోనే సీఐడీ చీఫ్ అయ్యన్నార్‌ను కలిసి ఫిర్యాదు చేస్తానని అన్నారు. స్పీకర్‌గా వ్యవహరించిన వ్యక్తి ఫేక్ డాక్యుమెంట్ సృష్టిస్తే ఉపేక్షించకూడదని అన్నారు. సీఎస్, సీఐడీ విచారణ చేపట్టకుంటే న్యాయసా?నాన్ని ఆశ్రయిస్తానని ఎమ్మెల్యే కూన రవికుమార్ వెల్లడించారు.

# మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లికి బెయిల్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల సమయంలో మాచర్ల నియోజకవర్గంలోని పాల్వాయ్ గేటులో ఈవీఎం ధ్వంసం, పోలీసులపై దాడి కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. రెండు నెలలుగా నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న పిన్నెల్లికి ఆగస్టు-23న ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇప్పటికే పలుమార్లు బెయిల్ పిటిషన్లు దరఖాస్తు చేసిన పిన్నెల్లికి ప్రతిసారీ హైకోర్టు షాకివ్వగా.. శుక్రవారం మధ్యాహ్నం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడం జరిగింది. 50 వేల రూపాయలతో రెండు పూచికత్తులు సమర్పించాలని పిన్నెల్లిని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

**కండిషన్స్ అప్లై..! :** పూచీకత్తులతో పాటు.. పాస్ పోర్టును సరెండర్ చేయాలని పిన్నెల్లిని హైకోర్టు ఆదేశించింది. ప్రతి వారం మేజిస్ట్రేట్, ఎస్‌హెచ్‌వో ముందు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. ఎలాంటి అనుమతులు లేకుండా దేశం విడిచి వెళ్లొద్దని కూడా క్లియర్ కట్‌గా హైకోర్టు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ నేపథ్యంలో నెల్లూరు సెంట్రల్ జైలు వద్ద పోలీసులు అప్రమత్తమయ్యారు. పిన్నెల్లి రిలీజ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించడంతో పాటు.. బారికేడ్లు ఏర్పాటు చేయడం జరిగింది. కాగా.. గత రెండు నెలలుగా నెల్లూరు సెంట్రల్ జైలులోనే ఉన్న పిన్నెల్లికి ఇవాళ బెయిల్ రావడంతో వైసీపీ కార్యకర్తలు, వీరాభిమానులు, అనుచరులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. పిన్నెల్లి సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ఇంకా పరారీలోనే ఉన్నారు.

**అసలేం జరిగింది..?** ఏపీ ఎన్నికలు జరిగిన మే-13న పాల్వాయి గేటు 202 పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించిన పిన్నెల్లి.. ఈవీఎం ధ్వంసం చేశారు. ఇదేంటి..? ఎందుకిలా దౌర్జన్యం చేస్తున్నారని అడ్డుకున్న టీడీపీ కార్యకర్త నంబూరి శేషగిరిరావుపై దాడి చేసిన ఘటనపై పిన్నెల్లిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. మరుసటి రోజు పరామర్శ పేరుతో కారంపూడిలో భారీగా అల్లర్లకు పాల్పడటమే కాకుండా విధుల్లో ఉన్న సీఐ నారాయణ స్వామిపై రాయితో దాడి చేశారు. ఈ ఉదంతంపై కేసు నమోదైంది. ఈ పరిణామాలన్నింటినీ నిశితంగా గమనించిన రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సినిమాటిక్ రేంజ్‌లో ఛేజ్ చేసి పిన్నెల్లిని పట్టుకున్నారు. రామకృష్ణారెడ్డి పోలీసులకు దొరకగా.. ఇంతవరకూ ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డి అడ్రస్ లేదు.

**తెలియదు.. గుర్తు లేదు..!** అరెస్ట్ అనంతరం నెల్లూరు జైల్లో ఉన్న రామకృష్ణా రెడ్డి నుంచి.. ఈ కేసులకు సంబంధించి నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు కోర్టు అనుమతితో పల్నాడు పోలీసులు నెల్లూరు జైలుకు వెళ్లి విచారణ సమయంలో పెద్ద హైడ్రామానే నడిచింది. పిన్నెల్లిని 50 ప్రశ్నలు అడగ్గా 30 ప్రశ్నలకు పైగా 'నేను వెళ్లలేదు.. వారెవరో నాకు తెలియదు..' అనే సమాధానాలు చెప్పినట్లు నాడు పెద్ద ఎత్తునే వార్తలు గుప్పుమన్నాయి. అంతేకాదు.. పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రానికి తాను వెళ్లలేదని, ఈవీఎం పగులగొట్టలేదని, అసలు నంబూరి శేషగిరిరావు ఎవరో తెలియదని, ఆరోజు తన వెంట గన్ మెన్ కూడా లేరని, పోలీసుల విచారణలో పిన్నెల్లి చెప్పడం గమనార్హం. ఈ క్రమంలోనే బెయిల్ మంజూరు చేయాలని పలుమార్లు పిటిషన్లు దరఖాస్తు చేసుకున్నావరుస ఎదురుదెబ్బలు తగలగా.. ఇవాళ బెయిల్ ఇచ్చింది హైకోర్టు.

# జగన్‌వి తప్పుడు ప్రచారాలు.. అచ్చెన్న ఫైర్




అమరావతి: అబద్ధాలే జన్మనక్షత్రం, తప్పుడు ప్రచారాలు లక్ష్యంగా మాజీ సీఎం జగన్ వ్యవహరిస్తున్నారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శలు చేశారు. ఆయన అబద్ధాలు నమ్మమని ముఖం మీద కొట్టి 11 సీట్లకు పరిమితం చేసినా జగన్ వైఖరిలో ఎటువంటి మార్పు రాలేదని ఆరోపణలు చేశారు. విశాఖ అచ్యుతాపురం సెజ్ ప్రమాద ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు అన్ని విధాలా అండగా ప్రభుత్వం నిలబడిందన్నారు. కూటమి ప్రభుత్వంపై జగన్ రెడ్డి నిస్సిగ్గుగా దుష్ప్రచారం చేస్తున్నారని అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ప్రమాదంలో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందించి అన్నివిధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే ధర్నా చేస్తానని జగన్‌రెడ్డి ప్రకటించడం దేనికి సంకేతం? అని ప్రశ్నించారు. ఈ సంఘటన జరిగిన నిమిషాల వ్యవధిలోనే ప్రభుత్వ యంత్రాంగం, అంబులెన్స్‌లు వచ్చి వైద్యం అందిస్తే ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదని జగన్ ఏ విధంగా మాట్లాడతారు? అని అచ్చెన్నాయుడు నిలదీశారు. ఎల్జీ పాలిమర్స్ ప్రమాద సమయంలో జగన్ ప్రకటించిన పరిహారం పూర్తి స్థాయిలో అందలేదని గుర్తుచేశారు. ఈ దుర్ఘటన జరిగిన తర్వాత 15 రోజుల వ్యవధిలో చనిపోయిన ముగ్గురికి రూ.లక్షతో పరిహారం సరిపెట్టిన విషయం వాస్తవం కాదా? అని నిలదీశారు. ప్రమాదంలో నష్టపోయిన వారిని ఆదుకోవాలని నిరసన తెలియజేసిన 30 మందిపై గోపాలపట్నం స్టేషన్‌లో కేసు పెట్టింది జగన్‌రెడ్డి కాదా? అని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. వైసీపీ హయాంలో పరిహారాల కోసం రోడ్డెక్కని బాధితులెవరైనా ఉన్నారా? అని నిలదీశారు. ద్విచక్ర వాహనాలపై రోగులను ఆస్పత్రులకు తీసుకెళ్లిన సంఘటనలు వైసీపీ హయాంలో కోకొల్లలు చోటు చేసుకున్నాయని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు.

# పరిశ్రమల భద్రతపై చర్యలు తీసుకుంటాం.. మంత్రి అనిత కీలక వ్యాఖ్యలు



విశాఖపట్నం: పరవాడ సినర్జీ ఫార్మా కంపెనీ ప్రమాద బాధితులను హోం మంత్రి వంగలపూడి అనిత పరామర్శించారు. క్షతగ్రాతులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ... మరో దురదృష్టకరమైన ఘటన జరిగిందని అన్నారు. రసాయనాలు కలిపేటప్పుడు ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. ఇచ్చామని చెప్పారు. గాయాలైన సూర్యనారాయణకు ధైర్యం చెప్పామని అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పరిశ్రమల యాజమాన్యాలు నిర్లక్ష్యంతో పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. పరిశ్రమల యాజమాన్యాలు భద్రత పరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. త్వరలో పరిశ్రమల భద్రతపై సమావేశం నిర్వహిస్తామని అన్నారు. ఒక కమిటీ వేసి, పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విశాఖపట్నంలో ఎల్జీపాలిమర్స్ లాంటి ఘటన జరిగిందని చెప్పారు. ఆ సమయంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి ఉందని చెప్పారు. ఆ ప్రమాద బాధితులను వైసీపీ ప్రభుత్వం అండగా లేదని మంత్రి అనిత వెల్లడించారు.

# పరవాడ ఫార్మాసిటీలో ప్రమాదం.. నలుగురికి గాయాలు



పరవాడ: అనకాపల్లి జిల్లాలో మరో ప్రమాదం జరిగింది. పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రెడియంట్స్ సంస్థలో రసాయనాలు కలుపుతుండగా నలుగురికి గాయాలయ్యాయి. గురువారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. క్షతగాత్రులను హుటాహుటిన విశాఖలోని ఇండస్ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పరిశ్రమ బి-బ్లాక్‌లోని మొదటి అంతస్తులో ఈ ఘటన చోటు చేసుకుంది. 6 కిలోలీటర్ల రియాక్టర్‌లో కెమికల్ నింపి ఛార్జింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. మ్యాన్‌హోల్ నుంచి రసాయనం ఉప్పొంగి పైకప్పునకు తగిలి కార్మికులపై పడింది. ఝార?ండ్‌కు చెందిన లాల్ సింగ్, కోహర్, రోస, విజయనగరానికి చెందిన కెమిస్ట్ సూర్యానారాయణకు గాయాలయ్యాయి. ఇండస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పరామర్శించారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు అధికారులతో మాట్లాడారు. హోంమంత్రి, ఇతర ఉన్నతాధికారులను వెంటనే అక్కడికి వెళ్లాలని ఆదేశించారు. దీంతో హోంమంత్రి అనిత ఇండస్ ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఇటీవల ఇదే జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 17 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.

గరుడ వార్త



# రష్మిక వాలు జడ వీపందం కిల్లింగ్

ఆ భారీతనం నిండిన ఆభరణాలు.. చేతి గాజులు.. వేలికి ఉంగరాలు.. మెడలో అలంకారాలు.. అంతకుమించి సాంప్రదాయ చీరకట్టు.. వీటన్నిటినీ ఆ జిలిబిలి నవ్వు డామినేట్ చేసేస్తోంది. ఒకదానికి మించి ఒకటిగా ఒంటిపై ఆభరణాలు పోటీపడుతున్న తరుణంలో ఆ పొడవాటి వాలు జడ, వీపందం అన్నిటినీ అధిగమించాయి. ఓవరాల్ గా రష్మిక మందన లుక్ స్టన్నింగ్ అని పొగిడేయని వారు లేరు. రష్మిక ఎంపిక చేసుకున్న గోల్డ్ కలర్ లెహంగా.. దానికి కాంబినేషన్ గా వైట్ అండ్ గోల్డ్ దుపట్టా.. క్రిస్టలైన్ డిజైన్ తో రూపొందించిన ప్రత్యేకమైన ఈ వస్త్రాలు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ఎంపిక చేసుకున్న దుస్తులకు తగ్గట్టుగానే రష్మిక మేకప్ సంవిధానం అందమైన చిరునవ్వు.. వాలు జడ యాప్ట్ గా ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్‌గా మారుతోంది. ఇంతకుముందే అంబానీల పెళ్లిలో సందడి చేసిన రష్మిక మందన ఇంతలోనే లుక్ ఛేంజ్ చేసి యువతరాన్ని ఆకర్షించింది. జూలై 12 శుక్రవారం తెల్లవారుజామున రష్మిక మందన్న ముంబైకి చేరుకుంది. అక్కడ తన అభిమానులతో ఎంతో ఓపిగ్గా సెల్ఫీలు దిగింది. అందుకు సంబంధించిన ఫోటోలు అంతర్జాలంలో వైరల్‌గా మారాయి. ఇదిలా ఉంటే రష్మిక మందన్న తదుపరి ధనుష్‌తో కలిసి కుబేరలో కనిపించనుంది. ఎగ్జైట్‌మెంట్



స్థాయిని పెంచేందుకు మేకర్స్ వరుస అప్‌డేట్‌లను షేర్ చేస్తున్నారు. తాజాగా రష్మిక ఈ చిత్రానికి సంబంధించిన తన ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేసింది. కుబేరలో, ధనుష్ ఒక నిరాశ్రయుడిగా మొదలై చివరికి శక్తివంతమైన మాఫియా లార్డ్‌గా ఎదిగే పాత్రను పోషించాడు. ఈ చిత్రంలో రష్మిక - ధనుష్‌లతో పాటు అక్కినేని నాగార్జున- జిమ్ సర్భ్ కూడా ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై సునీల్ నారంగ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. కుబేర పాన్-ఇండియన్ రిలీజ్ కి సిద్ధమవుతోంది. విడుదల తేదీని ఇంకా ప్రకటించాల్సి ఉంది. అయితే ఇది తమిళం, తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషలలో విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రతిభావంతులైన తారాగణం, ఆసక్తికరమైన కథాంశం, దర్శకత్వ ప్రతిభ వెరసి ఇది మోస్ట్ అవైటెడ్ సినిమాల జాబితాలో నిలుస్తోంది. అల్లు అర్జున్ - ఫహద్ ఫాసిల్ కీలక పాత్రల్లో నటించిన 'పుష్ప: ది రూల్' లోను రష్మిక తిరిగి శ్రీవల్లిగా తన పాత్రతో మైమరిపించనుంది. ఈ చిత్రంలో జగపతి బాబు, ప్రకాష్ రాజ్, సునీల్, ధనంజయ, జగదీష్ ప్రతాప్ తదితరులు నటిస్తున్నారు. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలోని సస్పెన్స్ చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'లోను రష్మిక నటిస్తోంది. ధీక్షిత్ శెట్టి సరసన కనిపిస్తుంది.

# అంబానీ ఇంట మెరుపులా చందమామ!

చందమామ కాజల్ అగర్వాల్ సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. సీనియర్ హీరోలకు పర్ఫెక్ట్ ఛాయిస్ గా నిలుస్తూ అవకాశాలు అంది పుచ్చుకుంటుంది. లేడి ఓరియేంటెడ్ చిత్రాల్లో సైతం అవకాశాలు అందుకుని తనదైన ముద్ర వేసే ప్రయత్నం చేస్తుంది. కానీ అమ్మడికి ఇంకా ఉమెన్ సెంట్రిక్ పరంగా సరైన స్టోరీ పడలేదు. ఇటీవలే సత్యభామ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది కానీ ఆశించిన ఫలితాలు సాధించలేదు. ప్రస్తుతం తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో సినిమాలు చేస్తోంది. అలాగే నెట్టింట కూడా నిత్యం అభిమానులు ఏదో రూపంలో టచ్ లో ఉంటుంది. కొత్త ఫోటోలతో యువతని ఆకర్షించే ప్రయత్నం చేస్తుంటుంది. మామ్ అయిన తర్వాత ఇన్ స్టా యాక్టివిటీని మరింత స్పీడప్ చేసింది. గర్భందాల్చిన సమయంలోనే తెలివిగా బేబిబంప్ ని ఎన్ క్యాష్ చేసుకుంది. బేబిప్రొడక్ట్ ల్ని ప్రచారం చేస్తూ ఇంట్లో కూర్చునే



సంపాదించేసింది. అంతవరకూ ఏ నటి ఇలాంటి ఛాన్స్ తీసుకోలేదు. కానీ కాజల్ మాత్రం ఈ విషయంలో ఎంతో తెలివిగా వ్యవహారించి కాసులు రాబట్టుకుంది. తాజాగా అంబానీ ఇంట అతిధిగా విచ్చేసిన అమ్మడు ఆ డిజైనర్ దుస్తుల్లో ముస్తాబైన వైనాన్ని నెటి జనులతో పంచుకుంది. ఇదిగో ఇక్కడిలా సంప్రదాయ పంజాబీ డిజైన్ మెరుపు డిజైన్ లో మురుపించింది. మెడలో ధరించిన బంగారు హారం..మ్యాచింగ్ చెవు భుట్టలు ప్రతీది చందమామ అందాన్ని రెట్టింపు చేసాయి. ఇక మ్యాకప్ పరంగా అంతే జాగ్రత్తలు తీసుకుంది. కళ్లకు ఐటెక్స్.. ఐబ్రోస్..నుదిటిన చిన్న స్టికర్..పెదాలకు ఎర్రని లిప్ స్టిక్ పూసుకుని మరింత ఆకర్షణీయంగా ముస్తాబైంది. శుభ్ ఆశీర్వాద్ లో భాగంగా కాజల్ హాజరైంది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. కాజల్ అభిమానుల్ని పిక్ ఆకట్టుకుంటుంది.




# మాధవి ముగ్గురు కుమార్తెలు మామ్ కి అచ్చు గుద్దినట్లే!





ఒకప్పటి అందమైన హీరోయిన్ మాధవి గురించి చెప్పాల్సిన పనిలేదు. అప్పట్లో వెండి తెరపై తానో అద్భుతం. అందమైన హీరోయినే కాదు..అంతకు మించి గొప్ప నటి. 80-90 దశకంలో హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగింది. శ్రీదేవి, విజయశాంతి, జయసుధ, జయప్రద లాంటి వాళ్లకే పోటీగా నిలిచిన హీరోయిన్ మాధవి.

చిరంజీవి-మాధవి కాంబినేషన్ లో ఎన్నో హిట్ సినిమాలున్నాయి. ఇంట్లో రామయ్య- వీధిలో కృష్ణయ్య, -చట్టంతో పోరాటం, మరణశాసనం,రోషగాడు, కోతల రాయుడు, దొంగమొగుడు, కుక్క కాటుకు చెప్పు దెబ్బ, బిగ్ బాస్ వంటి సూపర్ హిట్ సినిమాలు వచ్చాయి. ఇక ఖైదీలో రగులుతోంది మొగలిపొద అంటూ చిరంజీవి తో కలిసి సంచనలమే సృష్టించింది. ఆరోజుల్లోనే బికినీ బ్యూటీగానే పేరుగాంచింది. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, మలయాళం, ఒరియా భాషల్లో దాదాపు 300కి పైగా చిత్రాల్లో నటించింది. ఇక వివాహం తర్వాత మాత్రం సినిమాలకు రిటైర్మెంట్ ఇచ్చింది. వ్యాపారవేత్త రాల్ఫ్ శర్మని 1996లో వివాహం చేసుకుంది. అటుపై అమెరికాలో స్థిరపడింది. ప్రస్తుతం బిజినెస్ పనులు చూసుకుంటుంది. మాధవికి ముగ్గురు కుమార్తెలు. తాజాగా వాళ్ల ఫోటోలను మాధవి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ముగ్గురు కూడా అమ్మ పొలికలతో అచ్చు గుద్దినట్లే ఉన్నారు. పెద్ద కుమార్తె పేరు టిఫనీ, కాగా రెండో కూతురు ప్రిసిల్లా, మూడో కుమార్తె పేరు ఎవలిన్. ముగ్గురికి భరతనాట్యంలో మంచి శిక్షణ ఇప్పించింది.

మరి ఈ అందమైన కుమార్తెలను మాధవి సినిమా ఫీల్డ్ లోకి దించుతుందా? లేదా? అన్నది చూడాలి. అయితే ప్రస్తుతం ఉన్న కాంపిటీషన్...తన తోటి తారల పిల్లలు ట్రాక్ చెక్ చేసుకుని అన్నీ అనుకులంగా ఉంటేనే లాంచ్ చేస్తుంది. లేదంటే ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడే అవకాశం ఉంది.

# దేవర లీకులకి బ్రేక్స్ పడాల్సిందే



యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతోన్న మోస్ట్ అవైటెడ్ మూవీ దేవర షూటింగ్ చివరి దశలో ఉంది. బాలీవుడ్ బ్యూటీ అతిలోక సుందరి కూతురు జాన్వీ కపూర్ దేవర చిత్రంతో టాలీవుడ్ లోకి అడుగుపెడుతోంది. హైవోల్టేజ్ యాక్షన్ ప్యాక్డ్ మూవీగా ఈ సినిమాని కొరటాల శివ తెరకెక్కిస్తున్నారు. ఆచార్య లాంటి డిజాస్టర్ తర్వాత కొరటాల శివ నుంచి రాబోతున్న మూవీ కావడంతో తారక్ అభిమానులు క్యూరియాసిటీ గా ఎదురుచూస్తున్నారు.

ఎన్టీఆర్ ఏడాది టైం తీసుకొని కొరటాల శివతోనే దేవర చేయడానికి కారణం ఏమై ఉంటుంది తెలుసుకోవాలనే ఆసక్తి అందరిలో ఉంది. ఇదిలా ఉంటే ఆర్ఆర్ఆర్ లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత తారక్ నుంచి రాబోయే సినిమా ఇదే కావడంతో మోస్ట్ యాంటిసిపేటెడ్ చిత్రంగా ఈ సినిమా ఉంది. ఇప్పటికే వరల్డ్ వైడ్ గా దేవర సినిమా బిజినెస్ డీల్స్ క్లోజ్ అయినట్లు తెలుస్తోంది. టేబుల్ ప్రాఫిట్ తో ఈ సినిమాని నిర్మాతలు రిలీజ్ చేయబోతున్నారనే మాట వినిపిస్తోంది.

సెప్టెంబర్ 27న ఈ చిత్రం ఐదు భాషలలో వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతోంది. దేవర సినిమా నుంచి ఇప్పటి వరకు వచ్చిన లుక్స్, గ్లింప్స్, సాంగ్ సినిమాపై హైప్ క్రియేట్ చేసాయి. అనిరుద్ రవిచందర్ ఈ సినిమాకి సంగీతం, అందిస్తున్నారు. ఈ మధ్యకాలంలో పెద్ద సినిమాలకి లీకుల సమస్య ఎక్కువ అవుతోంది. దేవర సినిమా షూటింగ్ కి సంబందించిన ఫోటోలు చాలా లీకై బయటకొచ్చాయి. సోషల్ మీడియాలో అవి వైరల్ అయ్యాయి. చాలా సార్లు దేవర మూవీ సెట్ నుంచి ఫోటోలు లీకమయ్యాయి. అయితే తాజాగా దేవర మూవీలో ఎన్టీఆర్ క్యారెక్టర్ కి సంబందించిన ఒక డైలాగ్ బయటకొచ్చిందంట. ప్రస్తుతం దేవర మూవీ డైలాగ్ అంటూ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పాన్ ఇండియా లెవల్ లో హై ఎక్స్ పెక్టేషన్స్ మధ్య వస్తోన్న సినిమా నుంచి ఎలాంటి లీకులకి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందనే మాట వినిపిస్తోంది. వీటిని లైట్ గా తీసుకుంటే మున్ముందు సినిమాకి మరింత ప్రమాదం ఎదురయ్యే ఛాన్స్ ఉందని భావిస్తున్నారు. జూనియర్ ఎన్టీఆర్ దేవర మూవీపై చాలా నమ్మకంగా ఉన్నారు.

కచ్చితంగా బ్లాక్ బస్టర్ అయ్యి పాన్ ఇండియా లెవల్ లో తనకంటూ సోలో మార్కెట్ దేవరతో క్రియేట్ అవుతుందని అంచనా వేస్తున్నారు. కొరటాల శివ కూడా మూవీపైన చాలా హోప్స్ పెట్టుకున్నారు. అయితే ఈ లీకులు మాత్రం అందరిని టెన్షన్ పెడుతున్నాయని తారక్ ఫ్యాన్స్ అంటున్నారు.

# చీరందంలో హీటెక్కించిన హాట్ బ్యూటీ!

తాప్సీ సోషల్ మీడియా యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ప్రొఫెషనల్ గా ఎంత బిజీగా ఉన్నా ప్రయివేట్ ఫోటోలతోనూ అలరించడం అమ్మడి స్పెషాల్టీ. బాలీవుడ్ కి వెళ్లిన నాటి నుంచి ఈ రూల్ తూచ తప్పకుండా ఫాలోఅవుతుంది. అక్కడి ట్రెండ్ ని అనుసరిస్తూ గ్లామర్ వరల్డ్ లో ఇలాగే ఉండాలని ఎన్నోసార్లు ప్రూవ్ చేసింది. ఫ్యాషన్ ఎంపికల్లో తనదమైన మార్క్ ఎలివేషన్లతో ఆకట్టుకున్న సంద ర్భాలెన్నో. ఉత్తరాది అభిమానుల అభిరుచుకి తగ్గట్టు రూపలావణ్యంలో ఎన్నో మార్పులు చేసింది. మోడ్రన్ దుస్తుల్లో సెగలు పెట్టించిన సందర్భాలు కోకొల్లలు. తాజాగా అమ్మడు చీరందంలో హీటెక్కిస్తోన్న ఫోటోని ఇన్ స్టా వేదికగా వదిలింది. ఇందులో సొగసరి బ్లూ చీర ధరించి విశ్రాంతి తీసుకుటోన్న సమయం ఇదంటూ కుర్రాళ్లలోకి వచ్చేసింది. పాలనురుగల సౌందర్యంపై బులుగు అందం ఆపై కొప్పులో గులాబీ పువ్వు తెరిచిన బ్యూటీతో అలరిస్తుంది. ఈ ఫోటోని ఉద్దేశించి ఇది విశ్రాంతి తీసుకునే సమయం అంటూ



రాసుకొచ్చింది. నెట్ ఫ్లిక్స్ రిలీజ్ హసీన్ -2- ప్రచారంలో భాగంగా అమ్మడు ఇలా తెరపైకి వచ్చింది. ఇక అమ్మడి కెరీర్ సంగతి చూస్తే కొంత కాలంగా బాలీవుడ్ లోనే సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ కంటే బాలీవుడ్ లో బెటర్ గానే కొనసాగుతుంది. అక్కడికి వెళ్లిన తర్వాత సొంతంగా నిర్మాణ సంస్థని సైతం స్థాపించి పరిమిత బడ్జెట్ లో సినిమాలు నిర్మిస్తుంది. అక్కడి సెలబ్రిటీలందరితో అంతే మింగిల్ అవుతుంది. అక్కడే స్థిరపడాలి అన్న ఉద్దేశంతో అమ్మడు బాలీవుడ్ లో ముందుకు సాగుతుంది. అందుకు తగ్గ ప్రణాళిక వేసుకుని వెళ్తుంది. దాదాపు గా నాలుగైదేళ్లగా అక్కడే బిజీగా ఉంది. గత ఏడాది ఒకే ఒక్క సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చినా ఈ ఏడాది మాత్రం నాలుగైదు సినిమాలో రావడం పక్కాగా కనిపిస్తుంది. ఇప్పటికే కొన్ని కమిట్ అయిన ప్రాజెక్ట్ లు ఉన్నాయి. అవి షూటింగ్ దశలో ఉన్నాయి. మరికొన్ని చర్చల దశలో ఉన్నాయి. లాక్ అయితే ఏడాది ముగింపుకల్లా పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు వచ్చేయడం ఖాయం.

# ఒల్లు విరుపులతో అందాల సికిందర్

మాన్ సినిమాతో 1999 సంవత్సరంలో బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ షామా సికిందర్. ఈ అమ్మడు సినిమాలతో కంటే కూడా ఎక్కువగా బుల్లి తెర సీరియల్స్ మరియు షో ల కారణంగా గుర్తింపు సొంతం చేసుకుంది. నాలుగు పదుల వయసులో కూడా పాతికేళ్ల పడుచు అమ్మాయిలా ఈ అమ్మడు కనిపిస్తూ ఉంటుంది. బుల్లి తెర మరియు వెండి తెరపై తనదైన ముద్ర వేసిన షామా సికిందర్ ఇప్పుడు అందాల ఆరబోత ఫోటోలతో సోషల్ మీడియాను కుదిపేస్తుంది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ కి ఏమాత్రం తక్కువ కాదు అనిపించుకుంటూ అందాల ఆరబోత ఫోటో షూట్స్ తో రెచ్చిపోయింది. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. తాజాగా ఈ



అమ్మడు షేర్ చేసిన ఫోటోల్లో ఒల్లు విరుస్తూ ఫోటోలకు ఇచ్చిన ఫోజ్ లు అందరిని ఆకర్షిస్తున్నాయి. సాదారణంగానే సికిందర్ అందాలు వైరల్ అవుతాయి. ఈసారి అంతకు మించి అన్నట్లుగా స్కిన్ షో చేయడంతో పాటు, కవ్వించే విధంగా ఒల్లు విరుస్తున్న ఈ అమ్మడి ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఆకట్టుకునే అందం ఈ అమ్మడి సొంతం అయినా కూడా బాలీవుడ్ లో ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాకపోవడం వెనుక కారణం ఏంటో అంటూ నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముందు ముందు అయినా షామా సికిందర్ అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా ఇండస్ట్రీలో ఆఫర్లు సొంతం చేసుకోవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. సినిమాల్లో కాకున్నా కనీసం వెబ్ సిరీస్ ల్లో అయినా ఈ అమ్మడు అందాల ఆరబోత చూడాలని కోరుకుంటున్నామని ఫ్యాన్స్ అంటున్నారు.




దిల్లీ: కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. టీ-ఫైబర్ ప్రాజెక్టును భారత్ నెట్ ఫేజ్-3 పథకంలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గ్రామాలు, మండలాలకు నెట్‌వర్క్ కల్పించడమే టీ ఫైబర్ లక్ష్యమన్నారు. 65 వేల ప్రభుత్వ సంస్థలకు జీ2జీ, జీ2సీ సేవలు అందించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 63 లక్షల ఇళ్లకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. "పట్టణ ప్రాంతాల్లో 30 లక్షల గృహాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తాం. నెలకు రూ.300కే ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఈ-ఎడ్యుకేషన్ సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం.

టీ-ఫైబర్ అమలుకు ఎన్ఎఫ్ఓఎన్ సహకారం అవసరం. భారత్ నెట్ పథకాన్ని టీ-ఫైబర్‌కు వర్తింపజేయాలి. టీ-ఫైబర్‌కు రూ.1,779 కోట్ల వడ్డీ లేని రుణం ఇవ్వాలి" అని సీఎం కోరారు.

## గత ప్రభుత్వంలా ప్రచారం కోసం రూ.వేల కోట్లు వృథా చేయడం లేదు: మంత్రి పొంగులేటి



హైదరాబాద్: ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోనే 5 గ్యారంటీలు అమలు చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రూ.7 లక్షల కోట్లు అప్పులు ఉన్నప్పటికీ హామీలు అమలు చేశామన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటికి రాష్ట్రం రూ.7.19 లక్షల కోట్ల అప్పుల్లో ఉందన్నారు. ధనిక రాష్ట్రమని చెప్పి కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. "మేం ఇతర ఖర్చులన్నీ తగ్గించుకొని ప్రజలకు రుణమాఫీ చేశాం. ఇప్పటికే 22 లక్షలమంది రైతులకు రూ.2 లక్షల లోపు రుణలు మాఫీ చేశాం. దేశంలో ఏ రాష్ట్రం కూడా చేయని విధంగా రుణమాఫీ చేశాం. ఇప్పటికే రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు జమయ్యాయి. మిగిలిన రైతుల ఖాతాల్లో మరో రూ.12 వేల కోట్లు త్వరలోనే వేస్తాం. గత కేసీఆర్ ప్రభుత్వంలా మేం మోసం చేయట్లేదు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజలను రెండుసార్లు మోసం చేసింది. రూ.లక్ష రుణమాఫీ విడతల వారీగా చేస్తామని చెప్పి ఐదేళ్లలో కూడా చేయకుండా.. ఎన్నికల ముందు కొందరికే రుణమాఫీ చేశారు. చేసిన మంచి పనిని కూడా మేం ప్రచారం చేసుకోలేదు. గత ప్రభుత్వంలా ప్రచారం కోసం రూ.వేల కోట్లు వృథా చేయడం లేదు. ఉచిత విద్యుత్ కోసం రూ.42 లక్షల దరఖాస్తులు మాత్రమే సరిగా ఉన్నట్లు గుర్తించాం. తప్పులు సవరించి మరో 7 లక్షల మందికిపైగా ఉచిత విద్యుత్ వర్తింప చేస్తున్నాం. ఉచిత కరెంట్, గ్యాస్ రాయితీ లబ్ధిదారుల సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. దరఖాస్తుల్లో తప్పులు సవరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. వ్యవసాయ రుణం రూ.2 లక్షలకు పైగా ఉన్నవారి ఖాతాల్లో నిధులు వేయలేదు. రూ.2 లక్షలకు పైన ఉన్న మొత్తాన్ని చెల్లించాలని రైతులకు సూచించాం. ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామని మేం పదే పదే చెప్పాం. దానిని దృష్టిలో ఉంచుకొని భారాస నాయకులు విమర్శలు చేస్తున్నారు. 18 రాష్ట్రాల రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి.. కొత్త ఆర్వోఆర్ తీసుకొస్తున్నాం. తెలంగాణ ఆర్వోఆర్.. దేశానికే మోడల్‌గా నిలుస్తుంది. హైడ్రాను మంచి ఉద్దేశంతోనే తెచ్చాం.

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోని నిర్మాణాలకు అనుమతించేది లేదు. అలాంటి కట్టడాలను కూల్చివేస్తున్నాం. అవన్నీ గత ప్రభుత్వ హయాంలో జరిగిన నిర్మాణాలు. హిమయత్ సాగర్ ప్రాంతంలో ఎఫ్‌టీఎల్ పరిధిలో నా ఫామ్‌హౌజ్ ఉందని భారాస మీడియా బురద జల్లుతోంది. కేటీఆర్, హరీశ్‌రావుకు సవాల్ చేస్తున్నా.. నా ఇల్లు అక్రమంగా ఉంటే.. వెంటనే కూల్చివేయాలని హైడ్రా కమిషనర్‌ను ఆదేశిస్తున్నా. మా అధికారులకు బదులు మీరే వెళ్లి కొలవండి. అక్రమం అని తేలితే.. కూల్చేయండి" అని పొంగులేటి అన్నారు.

## మా సహనాన్ని పరీక్షిస్తే.. చర్యకు ప్రతిచర్య తప్పదు: కేటీఆర్



హైదరాబాద్: తమ సహనాన్ని పరీక్షిస్తే.. చర్యకు ప్రతిచర్య తప్పదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హెచ్చరించారు. రుణమాఫీపై చర్చకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరితే స్పందించలేదన్నారు. రుణమాఫీపై వాస్తవాలను బయటపెడుతున్నందుకు దాడులు చేస్తారా? అని ప్రశ్నించారు. కేటీఆర్‌తో పాటు పలువురు భారాస నాయకులు డీజీపీని కలిశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఫిర్యాదు చేశారు. గురువారం తిరుమలగిరిలో భారాస ధర్నా శిబిరంపై కాంగ్రెస్ నేతలు దాడి చేశారని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. శిబిరాన్ని పోలీసులే తొలగించారని ఆరోపించారు. రాష్ట్రంలో బాంబుల సంస్కృతి మళ్లీ వచ్చిందని డీజీపీకి చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "కాంగ్రెస్ నేతలు చారాణా కూడా రుణమాఫీ కూడా చేయలేదు. అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఫిర్యాదు చేశాం. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలి. భవిష్యత్‌లో చర్యకు ప్రతిచర్య ఉంటుంది" అని కేటీఆర్ అన్నారు.

## సంచార వాహనాల నిర్వహణను గాలికొదిలేశారు: హరీశ్‌రావు

హైదరాబాద్: పశు వైద్యశాలల్లో మందుల కొరతపై మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. పశువైద్య సంచార వాహన సేవల్లో అంతరాయం కలుగుతోందని ఇందులో పేర్కొన్నారు. మూగజీవుల మౌనరోదనను తొలగించడంలో ప్రభుత్వం విఫలమైందని వ్యాఖ్యానించారు.

వాటి సంరక్షణపై నిర్లక్ష్యం వహించడం శోచనీయమన్నారు. పశు వైద్యశాలల్లో 9 నెలలుగా మందుల కొరత ఉందని చెప్పారు. సకాలంలో వైద్యం అందక పశువులు చనిపోతున్నాయని చెప్పారు. అనారోగ్యం పాలైన మూగజీవాల వద్దకే వైద్య సిబ్బంది వచ్చి తక్షణ చికిత్స అందించేందుకు 1962 నెంబర్‌తో పశువైద్య సంచార వాహనాలను భారాస ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇది దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని చెప్పారు. అంతటి గొప్ప కార్యక్రమ నిర్వహణను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. సంచార వాహనాల్లో మందుల కొరత కారణంగా అత్యవసర పరిస్థితుల్లో మూగజీవుల ప్రాణాలు కాపాడాలనే సదాశయం నీరుగారిపోతోందని



పేర్కొన్నారు. ఇప్పటికే గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని అటకెక్కించారని, చేపల పంపిణీని ఆలస్యం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

1962 పశువైద్య సంచార వాహనాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, పశు వైద్యశాలల్లో మందులు అందుబాటులో ఉంచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## కాళేశ్వరం కమిషన్ ముందు హాజరైన సీడీవో ఎస్ఈ ఫజల్.. కీలక విషయాలు వెల్లడి

హైదరాబాద్: కాళేశ్వరం కమిషన్ ముందు నీటి పారుదల శాఖ సీడీవో ఎస్ఈ ఫజల్ విచారణకు హాజరయ్యారు. జస్టిస్ పీసీ ఘోష్ ఆయన్ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలను ఫజల్ వెల్లడించారు. మేడిగడ్డ ఆనకట్ట నిర్మాణంలో సీకెంట్ ఫైల్‌కు వెళ్లాలని కాళేశ్వరం సీఈ చెప్పారన్నారు. సుందిళ్ల రెండో బ్లాక్-ఏలో అదనపు 6 వెంట్లు డిజైన్‌లో లేవని తెలిపారు. మంత్రివర్గ నిర్ణయం మేరకు తర్వాత అదనపు వెంట్లు వేసినట్లు చెప్పారు. కాళేశ్వరం సీఈ నివేదిక మేరకు క్రాస్ సెక్షన్స్ ఆమోదించామన్నారు. ఆనకట్టల నిర్మాణ స్థలాన్ని పరిశీలించకుండానే వాటిని ఆమోదించినట్లు చెప్పారు. మరోవైపు సీడీవో విశ్రాంత ఈఎన్సీ నరేందర్‌రెడ్డి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు రెండో రోజు విచారణకు హాజరయ్యారు. గురువారం నాటి విచారణకు కొనసాగింపుగా 2 లేఖలను కమిషన్‌కు అందజేశారు.

## జైల్లో తనను చిత్ర హింసలు పెట్టారు.. ప్రో.జీఎన్ సాయిబాబా కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్: పదేళ్ల తర్వాత తాను స్వేచ్ఛగా తెలంగాణలో మాట్లాడుతున్నానని ప్రో.జీఎన్ సాయిబాబా తెలిపారు. జైలు నుంచి 5 నెలల తర్వాత బయటకు వచ్చినట్లు వెల్లడించారు. ఢిల్లీలో కిడ్నాప్ చేసి తనను అక్రమంగా అరెస్టు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. జైల్లో తనను చిత్ర హింసలు పెట్టారని అన్నారు. తాను వికలాంగుడినని కూడా చూడలేదని చెప్పారు. తనకు 21రకాల ఆరోగ్య సమస్యలు వచ్చాయని తెలిపారు. జైల్లో అండా సెల్లో...ప్రత్యేకమైన ఒక రూమోలో నిర్బంధించి... వీల్ చైర్‌లో తిరిగే పరిస్థితి లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఎలాంటి న్యాయం జరగలేదని అన్నారు. జైల్లో కుల వ్యవస్థ విచ్చలవిడిగా కనిపిస్తుందని మండిపడ్డారు. కులాన్ని చూసి జాబ్ ఇస్తారని ఆరోపించారు. జైలులో మ్యాన్యువల్‌లో కులాన్ని బట్టి పనివ్వండి అని రాసి ఉందని ప్రో.జీఎన్ సాయిబాబా విమర్శలు చేశారు.

**అసలు ఏమైందంటే..** నిషేధిత కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్)లో సభ్యుడిగా ఉన్నారని ప్రో.జీఎన్ సాయిబాబాపై ఆరోపణలు వచ్చాయి. తొలిసారిగా మహారాష్ట్ర పోలీసులు మే 2014లో ఆయనను అరెస్టు చేశారు, వారికి లాజిస్టికల్ సపోర్ట్ అందించి రిక్రూట్‌మెంట్‌లో సహాయం చేశారు. కాగా, అతనికి 2016లో మధ్యంతర బెయిల్ మంజూరైంది, ఆ తర్వాత 2017 మార్చిలో దోషిగా నిర్ధారించడంతో సాయిబాబాకు జీవిత ఖైదు విధించబడింది. అయితే, అక్టోబర్ 2022లో, బాంబే హైకోర్టు మరొక బెంచ్ సాయిబాబా, ఇతరులను నిర్దోషులుగా ప్రకటించింది. ఆ తీర్పును అదే సంవత్సరం సుప్రీంకోర్టు నిలిపివేసింది. ఏప్రిల్ 23, 2023న, సుప్రీం తీర్పును పక్కన పెట్టి, కొత్త బెంచ్ ముందు సాయిబాబా దాఖలు చేసిన అప్పీల్‌ను జాబితా చేయాలని బాంబే హై కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరింది.




దాదాపు రెండున్నరేళ్లకుపైగా యుద్ధంతో కునారిల్లుతున్న ఉక్రెయిన్‌లోకి భారత ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఉదయం స్థానిక కాలమానం ప్రకారం 7.30 గంటలకు అడుగుపెట్టారు. పోలాండ్ నుంచి ఆయన బయల్దేరిన రైలు కీవ్‌కు చేరుకొంది. రైల్వేస్టేషన్ నుంచి ఆయన వాహన కాన్వాయ్ బయల్దేరి బస చేయనున్న ప్రదేశానికి వెళ్లింది. పోలండ్‌లో గురువారం పర్యటన ముగించుకొన్న మోదీ రైలు మార్గంలో ఉక్రెయిన్‌కు బయల్దేరారు. ఆయన దాదాపు 10 గంటలు ప్రయాణించి కీవ్‌కు చేరుకొన్నారు. భారత్ ఏ పక్షం వహించదని.. కేవలం శాంతికి మాత్రం వారధిగా పని చేస్తుందనే సందేశం ఇచ్చేందుకు ప్రధాని ఈ పర్యటనను చేపట్టారు. ఆయన పర్యటనలోని కార్యక్రమాల వివరాలు భద్రతా కారణాల వల్ల గోప్యంగా ఉంచారు. కీవ్‌లోని భారత సంతతి ప్రజలు రైల్వే స్టేషన్ వద్ద మోదీకి భారత పతాకాలతో స్వాగతం పలికారు. ఉక్రెయిన్‌లోని ఇస్కాన్ బృంద సభ్యులు కూడా దీనికి హాజరయ్యారు. దాదాపు ఏడు గంటలపాటు జరగనున్న ఈ పర్యటనలో భాగంగా నేడు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మోదీ భేటీ కానున్నారు. స్థానిక ఏవీ ఫొమిన్ బొటానికల్ గార్డెన్‌లోని మహాత్మాగాంధీ కాంస్య విగ్రహానికి ప్రధాని నివాళి అర్పించనున్నారు. దీనిని 2020లో గాంధీ 151వ జయంతి సందర్భంగా ఏర్పాటుచేశారు. ఈ పర్యటనలో భాగంగా ఉక్రెయిన్ నేషనల్ మ్యూజియంను కూడా ప్రధాని సందర్శించనున్నారు. రష్యా దాడిలో మరణించిన చిన్నారులకు ఇక్కడ ఆయన నివాళి అర్పిస్తారు. ఈ మ్యూజియంలో ఉక్రెయిన్ ఎదుర్కొన్న అతిపెద్ద సంక్షోభాల ఆనవాళ్లను ఆయన వీక్షించనున్నారు. 1991లో సోవియట్ నుంచి విడిపోయి ఉక్రెయిన్ ఏర్పడిన తర్వాత భారత ప్రధాని ఆ దేశాన్ని సందర్శించడం ఇదే తొలిసారి. ఇక ఇటీవల ఇటలీ వేదికగా జరిగిన జీ7 శిఖరాగ్ర సదస్సులో భాగంగా మోదీ, జెలెన్‌స్కీ భేటీ అయిన విషయం తెలిసిందే. భారత్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించిన మోదీకి ఉక్రెయిన్ అధ్యక్షుడు ఫోన్ చేసి అభినందించారు. తీరిక చేసుకొని ఉక్రెయిన్‌లో పర్యటించాల్సిందిగా మోదీని కోరగా.. తాజాగా ఆ ఆహ్వానాన్ని స్వీకరించిన మోదీ కీవ్‌కు చేరుకొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి హరీష్‌రావు లేఖ.. ఎందుకంటే..?



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు లేఖ రాశారు. వ్యవసాయంలో దన్నుగా నిలుస్తూ, పాడిసంపదతో అదనపు ఆదాయాన్ని సమకూర్చే మూగజీవాల సంరక్షణపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం శోచనీయమని మండిపడ్డారు. ఈరోజు (శుక్రవారం) తెలంగాణ భవన్‌లో హరీష్‌రావు మీడియాతో మాట్లాడుతూ... పశుసంవర్ధక శాఖ కూడా సీఎం వద్దే ఉన్నప్పటికీ మూగజీవాల మౌనరోదనను మాత్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకితే తగిన వైద్యం అందించేందుకు ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు లేని దుస్థితి నెలకొందని అన్నారు. ఎమర్జెన్సీ మందులు సహా పెయిన్ కిల్లర్స్, విటమిన్స్, యాంటీ బయాటిక్స్ వంటి అన్ని రకాల మందుల సరఫరా 9 నెలలుగా నిలిచిపోయిందని అన్నారు. పాలిచ్చే జీవులకు పొదుగు వాపు, గాలి కుంటు వ్యాధులు సోకితే ఒక్కో మూగ జీవిపై పాడి రైతులు రెండు వేల దాకా ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. ఇది వారికి అదనపు ఆర్థిక భారమవుతుందని చెప్పారు. మూగజీవాల్లో అంతర పరాన్న జీవులను నివారించేందుకు మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందులను తప్పనిసరిగా వేయాల్సి ఉంటుందని చెప్పారు. 9 నెలల నుంచి నట్టల నివారణ మందులు సరఫరా చేయకపోవడంతో కాలేయం, జీర్ణాశయం, చిన్నపేగు భాగాల్లో పరాన్న జీవులు చేరి రక్తహీనతకు గురి చేస్తున్నాయని అన్నారు. రోగ నిరోధకశక్తి తగ్గి మూగజీవాలు బలహీనంగా మారుతున్నాయన్నారు.

వ్యాధుల బారిన పడ్డ జీవులు ఆస్పత్రుల్లో మందుల కొరత కారణంగా సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు వాహన ఉద్యోగులు సకాలంలో వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన చెందుతున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం ఒక్కసారి కూడా సమీక్ష నిర్వహించకపోవడం మూగజీవుల సంరక్షణపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తుందన్నారు. నిర్లక్ష్యం వీడి తగిన చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు కోరారు.

## హైడ్రా విషయంలో బీఆర్ఎస్ నేతల తీరు విడ్డూరంగా ఉంది




హైదరాబాద్: రైతులను కొందరు రెచ్చగొట్టి ధర్నాలు చేయిస్తున్నారని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు.తనను లోక్ సభకు పోటీ చేయమని కేసీఆర్ అడిగారు. తాను నో చెప్పానని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రభుత్వానికి సహకరిస్తామని కేసీఆర్‌కి చెప్పానని, ఆయన పట్టించుకోలేదని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేదని అన్నారు.శుక్రవారం(ఈరోజు) తన కార్యాలయంలో కోదండరాం మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త ప్రభుత్వానికి చిప్ప చేతిలో పెట్టి పోయిందని విమర్శించారు. రుణమాఫీ చాలామందికి అయిందని... కొన్ని టెక్నికల్ ఇబ్బందులతో కొందరికి రుణమాఫీ కాలేదని చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న కట్టడాలకు గత ప్రభుత్వం పర్మిషన్ ఎందుకు ఇచ్చారంటే బీఆర్ఎస్ నాయకుల వద్ద సమాధానం లేదని అన్నారు. హైడ్రా విషయంలో తమకి మినహాయింపు ఇవ్వమని బీఆర్ఎస్ నేతలు కోరడం విచిత్రంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వం చెరువులను నాశనం చేసిందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమ కారులను గుర్తించలేదని అన్నారు. తనకు ఎమ్మెల్సీ రావడం ఉద్యమకారులకు ఇచ్చిన గుర్తింపుగా చూస్తున్నారని మండిపడ్డారు. రాజీవ్ గాంధీ ఒక పార్టీకి సంబంధించిన వ్యక్తి కాదని చెప్పారు. రాజీవ్ విగ్రహం విషయంలో కత్తులు దుయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు పెట్టలేదు? అని ప్రశ్నించారు. తెలంగాణ మేధావులు, ఉద్యమకారులు అని బయటకి వచ్చేవాళ్లు నిష్పక్షపాతంగా ఉండాలని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం పెడుతామని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. తాత్సారం చేయకుండా ఏకకాలంలో రుణమాఫీ చేయడం మంచి నిర్ణయమని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రుణమాఫీ చేస్తే అభ్యతరం ఉండదన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తే అభ్యంతరమా? అని అన్నారు. తెలంగాణలోనే రైతులకు ఇచ్చే రుణాలు తక్కువే అని చెప్పారు. జనాలకి దూరం అవుతానని సెక్యూరిటీ వద్దు అన్నానని కోదండరాం వెల్లడించారు.

## టంగుటూరు ప్రకాశం పంతులు జీవితం స్ఫూర్తిదాయకం

హైదరాబాద్, ఆగస్టు 23: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు 153 వ జయంతి నేడు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రకాశం పంతులుకు నివాళులర్పించారు. అసంబ్లీ ముందున్న ప్రకాశం పంతులు విగ్రహానికి వెంకయ్య, వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ విషయాన్ని వెంకయ్య ఎక్స్ వేదికగా పంచుకున్నారు.

**వెంకయ్య ట్వీట్...** టంగుటూరు ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని శాసనసభ సముదాయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి శుక్రవారం పుష్పాంజలి ఘటించినట్లుతెలిపారు. సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో ఆంగ్లేయ సాయుధ బలగాలకు గుండెలు చూపిస్తూ ధైర్యం ఉంటే కాల్చుకోండి అని సింహంలా గర్జించి ఆంధ్ర కేసరిగా సుప్రసిద్ధులైన ప్రకాశం పంతులు జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగిన ప్రకాశం పంతులుఎంతో కష్టపడి బారిష్టర్ చదివి



స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. ఆంధ్రరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. ఆయన నిస్వార్థ కర్తవ్య దీక్ష యువతరానికి స్ఫూర్తిదాయకమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ట్విట్ చేశారు.

## సిబ్బంది నిర్లక్ష్యం.. కుర్చీలోనే గర్భిణి ప్రసవం

నల్గొండ అర్బన్: సిబ్బంది నిర్లక్ష్యంతో కుర్చీలోనే గర్భిణి ప్రసవించిన ఘటన నల్గొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నేరేడుగొమ్మ మండలానికి చెందిన నల్లవెల్లి అశ్విని తన భర్తతో కలిసి గురువారం రాత్రి ప్రసవం కోసం దేవరకొండ ప్రభుత్వాసుపత్రిలో చేరింది. అక్కడి వైద్యులు మూడో కాన్పు చేయడం కుదరదంటూ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి సిఫార్సు చేశారు. దీంతో ఆమె గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత నల్గొండ ఎంసీహెచ్‌లో చేరింది. వెంటనే బెడ్, ఇతర సౌకర్యాలు కల్పించకపోవడంతో కుర్చీలోనే కూర్చుని ఉంది. ఆ సమయంలోనే పురిటి నొప్పులు వచ్చి మగశిశువుకు జన్మనిచ్చింది. గమనించిన సిబ్బంది ఆమెను వార్డులోకి తీసుకెళ్లి చికిత్స అందించారు. సమాచారం తెలుసుకున్న జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచందర్ ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com